ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
మంగళవారం 14 జులై 2026 సంపుటి: 1 సంచిక: 27 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad, Mahabubnagar

పౌరసత్వ నిర్ధారణలో
## పారదర్శకత ముఖ్యం
అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం 2



పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరసత్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది.

న్యూఢిల్లీ, జూలై 13 (సింగిడి)



ఇరాన్ రివెంజ్ లిస్ట్
## కలకలం!
ట్రంప్, నెతన్యాహుతో పాటు 13 మంది టార్గెట్? 2

# కాంగ్రెస్ ఈటెలకు పోట్లు
## కాళేశ్వరం వ్యాఖ్యలతో కొత్త వివాదానికి కేంద్రంగా ఈటల

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త దుమారానికి దారితీశాయి. ప్రాజెక్టులో లోపాలు ఉన్నా... వాటిని సరిచేసి రైతుల కోసం వినియోగంలోకి తీసుకురావాలని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు కారణమయ్యాయి. ఇదే వ్యాఖ్యలను కాంగ్రెస్ తన రాజకీయ దాడికి అస్త్రంగా మార్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కాళేశ్వరం అంశాన్ని మాత్రమే కాదు, బీజేపీ–బీఆర్ఎస్ సంబంధాల చర్చను కూడా ఒకేసారి తెరపైకి తీసుకొచ్చారు.

– స్టేట్ బ్యూరో (సింగిడి)

**ఈటల మాటలనే కాంగ్రెస్ రాజకీయ అస్త్రంగా మలిచిందా?**
**రైతుల అంశం నుంచి బీజేపీ–బీఆర్ఎస్ బంధం వరకు రేవంత్ దాడి**
**ఒక్క వ్యాఖ్యతో మారిపోయిన రాజకీయ చర్చ**



**ఈటల ఏమన్నారు..?**

కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టడం వల్ల నష్టపోయేది రైతులేనని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. నిర్మాణంలో లోపాలు ఉం టే సాంకేతికంగా సరిచేయాలని, కోట్లాది రూ పాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టును రాజకీయ కారణాలతో నిరుపయోగంగా మా ర్చడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం లక్ష్యం రైతుకు సాగునీరు అందించడమేనని, అందువల్ల దాన్ని ఉపయోగించే మార్గాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్టును పూర్తిగా విస్మరించడం కంటే పరిష్కార మార్గం వెతకాలని ఆయన అభిప్రాయపడినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకున్నాయి.

**రేవంత్ ఎందుకు ఈటలనునే టార్గెట్ చేశారు..?**

ఖమ్మం జిల్లా జగన్నాథపురం రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందన కేవలం కాళేశ్వరం అంశానికే పరిమితం కాలే దు. ఈటల వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ దగ్గరితనం ఉందన్న కాంగ్రెస్ వాదనను మరోసారి ముందుకు తెచ్చారు. కన్నెపల్లికి వెళ్తుంటే కేటీఆర్ ఎందుకు లేరు?, బీజేపీతో చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయా?, భద్రాద్రి రామయ్యపై ఒట్టు పెట్టి చెప్పండి అంటూ చేసిన వ్యాఖ్యలతో రాజకీయ చర్చను పూర్తిగా కొత్త దిశలోకి మళ్లించారు.

**ఒక్క వ్యాఖ్య... ఎన్నో రాజకీయ అర్థాలు**

ఈటల రాజేందర్ వ్యాఖ్యల్లో ప్రధానంగా రైతు ప్రయోజనాల అంశం ఉన్నప్పటికీ... కాంగ్రెస్ మాత్రం వాటిని రాజకీయ సమీకరణాల కోణంలో విశ్లేషిస్తోంది. కాళేశ్వరం

...మిగతా 2లో



కేంద్ర సహకారంతోనే
## అభివృద్ధి సాధ్యం 2
పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి
**మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి**
**ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ**
**ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు**
**సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్టాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు.

- హైదరాబాద్,జులై13 (సింగిడి)

అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్
## దోచుకుంటోంది
సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ ఎస్, కాంగ్రెస్
**గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు**
**సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి** 2



సింగరేణిలో ప్రస్తుత పరిసితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు.

భద్రాద్రి కొత్తగూడెం, జూలై13 (సింగిడి)

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు
తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ
**పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి**



పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్ధనను సుప్రీంకోర్టు నిరాకరించింది.

- న్యూఢిల్లీ, జులై 13 (సింగిడి) 2

సుప్రీం సాక్షిగా బయటపడ్డ
## రేవంత్ వైఫల్యం




బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులతడక గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు 2

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు
## శుభవార్త
పాత పెన్షన్ స్కీమ్ ఎంచుకునే వెసులబాటు

ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని ఓపీఎస్ ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది.

2 - అమరావతి, జూలై 13 (సింగిడి)



విద్యార్థుల్లో కులవివక్షను
## దూరం చేస్తున్నాం
యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి
ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సిఎం రేవంత్

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు.

- హైదరాబాద్,జులై13 (సింగిడి)

షాబాద్ ఆరు మర్డర్ల కేసు
## నిందితుడు రాజ్‌కుమార్ మృతి
కొత్తూరు మండలం పెంజర్లలో మృతదేహం లభ్యం



**మృతదేహం పక్కనే పాయిజన్ బాటిల్**
**ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణ**
**స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన షాబాద్ ఆరు మర్డర్ల కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్ మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో ఓ వెంచర్ వద్ద అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

–షాబాద్, జులై 13 (సింగిడి)

**'ఆ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయా'** 2

సింగరేణి అధికారుల సమస్యలపై
## సత్వర నిర్ణయం
సింగరేణి యాజమాన్యానికి భట్టి విక్రమార్క ఆదేశాలు



సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.

హైదరాబాద్,జులై13 (సింగిడి) 2



'అయోధ్య' చోరీ కేసు 2
## దర్యాప్తుపై నివేదిక కోరిన సుప్రీం

అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన వేళ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

- న్యూఢిల్లీ, జూలై 13 (సింగిడి)

## ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్దరణ
పనులను ప్రారంభించిన చంద్రబాబు
గత వైసిపి బ్యారేజీని నిర్లక్ష్యం చేసిందని విమర్శ

మూడు జిల్లాల పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సోమవారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్దరణ పనులను చంద్రబాబు ప్రారంభించారు. పునరుద్దరణ పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. 2014–19 మధ్య కాలంలో ధవళేశ్వరం బ్యారేజీకి 58 కొత్త గేట్లను అప్పటి తెదేపా ప్రభుత్వం అమర్చింది. ఇప్పుడు సీడబ్ల్యూసీ సూచనల మేరకు మిగిలిన 117 గేట్లకు కొత్త గేట్లను అమర్చే పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో సీఎం మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెల నాటికి కొత్త గేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

రాజమహేంద్రవరం, జూలై 13 (సింగిడి) 2





తమిళనాడులో
## ఘోర ప్రమాదం 2
ఎదురెదురుగా రెండు బస్సులు ఢీకొని ఐదుగురు దుర్మరణం

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢకోనడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున మదురై జిల్లాలోని కొట్టంపట్టి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

చెన్నై, జూలై 13 (సింగిడి)



గోవధ నిషేధంపై
మద్రాస్ హైకోర్టు
## తీర్పుపై స్టే
తీర్పుకు సవరణ అవసరమన్న సుప్రీంకోర్టు 2

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
14 జులై 2026

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించిన రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించిన కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించా. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇబ్బంది ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు అభ్యంతరం ఇబ్బంది ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపీలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో పాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# షాబాద్ ఆరు మర్డర్ల కేసు నిందితుడు రాజ్‌కుమార్ మృతి

ఈ గ్రామం అతని మేనమామ స్వగ్రామంగా తెలుస్తోంది. రాజ్‌కుమార్ మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే డయల్-100కు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, మృతదేహం సమీపంలో విషం బాటిల్ కనిపించినట్లు సమాచారం. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. జులై 10వ తేదీ అర్ధరాత్రి రాజ్‌కుమార్ ఆరుగురిని హత్య చేశాడు. అతడిపై ఈ ఏడాది మే 16న పోక్సో కేసు నమోదైంది. జైలుపై విడుదలైన అతడు మొదట తనపై ఈ కేసు పెట్టిన బాలిక తల్లి, నాయనమ్మలను చంపాడు. తరువాత బాలికను అక్కడ నుంచి దైవాలగూడ అనే మరో గ్రామానికి తీసుకువెళ్లి అక్కడ చెరువు దగ్గర ఆమెను గొంతుకోసి చంపాడు. తరువాత అదే గ్రామంలోని తన ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలను చంపాడు. అరగంటలో ఆరు హత్యలతో సంచలనం సృష్టించిన అతడి కోసం పోలీసులు 12 బృందాలతో తీవ్రస్తాయిలో వేట సాగించారు. అయితే, చివరికి అతడు ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది.

# ‘ఆ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయా’..

**హత్యలకు ముందు 'షాబాద్' హంతకుడి సంచలన సెల్ఫీ వీడియో**

**షాబాద్, జులై 13 (సింగిడి)**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో సంచలనం సృష్టించిన హత్యల కేసులో కీలక పురోగతి లభించింది. హంతకుడు రాజ్ కుమార్ హత్యలు చేయడానికి ముందు రికార్డు చేసిన ఒక సెల్ఫీ వీడియోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజ్‌కుమార్ మృతదేహం లభ్యమైన ప్రదేశంలోనే అతడి మొబైల్ ఫోన్ కూడా దొరికిందని, ఆ ఫోన్‌లో ఈ వీడియో ఉన్నట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ (CP) తరుణ్ జోషి అధికారికంగా స్పష్టం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజ్ కుమార్ ఈ దారుణానికి ఒడిగట్టడానికి ముందు, జూలై 10వ తేదీ సాయంత్రం సరిగ్గా 4:55 గంటల సమయంలో తన ఫోన్‌లో ఈ వీడియోను రికార్డు చేశాడు. ఈ వీడియోలో తను ఎదుర్కొంటున్న మానసిక క్షోభ, ఆర్థిక ఇబ్బందులు, అలాగే ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను వివరించినట్లు సీపీ తెలిపారు.

**వీడియోలో రాజ్ కుమార్ వాంగ్మూలం..**

లభ్యమైన వీడియోలో రాజ్ కుమార్ మాట్లాడిన మాటలను సీపీ వెల్లడించారు. "నా సంపాదనలో సగం వాళ్ల కోసమే ఖర్చు పెట్టాను. నా దగ్గర నుంచి పెద్ద మొత్తంలో పైసలు వసూలు చేసి నన్ను పూర్తిగా లాస్ (నష్టపోవడానికి) చేశారు. ఆ అమ్మాయిని నమ్మి నేను పూర్తిగా అప్పుల పాలయ్యాను. ఆఖరికి నా పిల్లలకు రూపాయి భూమి కూడా లేకుండా చేసుకున్నా. నన్ను ఇంతలా ముంచేసి, లాస్టుకు నాపైనే కేసు పెట్టి నన్ను జైలుకు పంపించారు" అంటూ రాజ్‌కుమార్ ఆ వీడియోలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తాను నమ్మిన వారి వల్లే అప్పులపాలయ్యానని, చివరికి తనపైనే కేసు పెట్టి జైలుకు పంపించారనే కక్షతోనే రాజ్కుమార్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమికంగా అర్థమవుతోంది. దొరికిన మొబైల్ ఫోన్ను.. వీడియోను సైన్స్ అండ్ ఫోరెన్సిక్ ల్యాబు పంపించి మరిన్ని సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నామని, కేసు దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని సీపీ తరుణ్ జోషి పేర్కొన్నారు.

# ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ

గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. బ్యారేజీని గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాటన్ బ్యారేజీ గేట్లను మార్చలేదని.. కొట్టుకుపోయినా పట్టించుకోలేదంటూ వైసీపీపై మండిపడ్డారు. గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్లను పునరుద్దరణ చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టులో 72 శాతం పనులను పూర్తి చేశామని.. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని సీఎం తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నా యన్నారు. పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని.. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేశామని చెప్పుకొచ్చారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో డబ్బులు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అభిమానులు ఎక్కువని అన్నారు. పవన్ భుజానికి శస్త్ర చికిత్స జరిగిందని.. ముంబై వెళ్లి ఆయనను పరామర్శించినట్లు తెలిపారు. ఆరోగ్యం కుదుటపడ్డాకే విధుల్లోకి రావాలని పవన్‌కు చెప్పానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# ‘అయోధ్య’ చోరీ కేసు దర్యాప్తుపై నివేదిక కోరిన సుప్రీం

ఈ చోరీపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. వీటిని విచారణకు స్వీకరించిన సుప్రీం ధర్మాసనం.. పిటిషన్లపై స్పందించాలని కేంద్రంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఆలయ నిర్వహణను చూస్తోన్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు కూడా నోటీసులు ఇచ్చింది. సిట్‌లో భాగమైన సభ్యుల వివరాలను కూడా నివేదికలో ప్రస్తావించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఆదేశాల్లో పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వెల్లడించారు. ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది. అయోధ్య రామాలయ విరాళాల చోరీ వ్యవహారంపై తీవ్ర విమర్శలు రావడంతో యూపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దర్యాప్తులో భాగంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఆ నేపథ్యంలోనే శ్రీరామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రారు రాజీనామా చేశారు. అయితే, తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమని ఆయన పేర్కొన్నారు.

# అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది

కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాకపైమాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం పక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాకలో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి దారితీసిందని విమర్శించారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు మిగిల్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# కాంగ్రెస్ 'ఈటె'లకు పోట్లు

**మొదటి పేజీ తరువాయి..**

విషయంలో బీఆర్ఎస్ చెబుతున్న వాదనకే బీజేపీ మద్దతు పలుకుతోందని, దీంతో రెండు పార్టీల వైఖరిలో తేడా కనిపించడం లేదని కాంగ్రెస్ నాయకత్వం ఆరోపిస్తోంది. ఈ వాదనను బలపరచడానికి ఈటల వ్యాఖ్యలను ఉదాహరణగా చూపిస్తోంది.

**కాంగ్రెస్ వ్యూహం ఇదేనా..?**

కాళేశ్వరం చర్చను కేవలం ప్రాజెక్టు పరిమితుల్లో ఉంచకుండా... ప్రతిపక్షాల రాజకీయ సంబంధాలపై దృష్టి మళ్లించడం కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను ఎదుర్కొంటూనే... బీజేపీపై కూడా ఒకేసారి రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నం జరుగుతోందనే విశ్లేషణ వినిపిస్తోంది. ఈటల వ్యాఖ్యలపై నేరుగా స్పందించడం ద్వారా కాంగ్రెస్ అసలు లక్ష్యం బీజేపీ విశ్వసనీయతను ప్రశ్నించడమేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**ఈటల వ్యాఖ్యలతో మారిన రాజకీయ ఎజెండా**

కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం చుట్టూ ప్రారంభమైన చర్చ... ఇప్పుడు బీజేపీ-బీఆర్ఎస్ సంబంధాల వరకు విస్తరించింది. ఒకవైపు రైతుల ప్రయోజనాల పేరుతో ఈటల చేసిన వ్యాఖ్యలు... మరోవైపు వాటిని రాజకీయంగా అర్థం చేసుకుంటున్న కాంగ్రెస్... ఈ రెండు పరిణామాలతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త వాదనకు తెరలేచింది.

**ఇప్పుడు అందరి చూపు ఈటలపైనే...**

కాళేశ్వరం అంశంపై ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సాధారణ రాజకీయ స్పందనగానే మిగిలిపోలేదు. అవే వ్యాఖ్యలు కాంగ్రెస్ దాడికి కేంద్రబిందువయ్యాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే... ఈటల తన వ్యాఖ్యలను మరింత స్పష్టం చేస్తారా? లేక కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ విమర్శలకు బీజేపీ సమష్టిగా సమాధానం ఇస్తుందా? రానున్న రోజుల్లో ఈ అంశం తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.

# తమిళనాడులో ఘోర ప్రమాదం

ప్రైవేటు బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను దాటింది. అదే సమయంలో తిరుచిరాపల్లి వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు ఎదురుగా రావడంతో దానిని ఢకొట్టి పక్కనే ఉన్న ప్రయాణికుల షెడ్డులోకి దూసుకెళ్లింది. ప్రైవేటు బస్సు అతివేగంగా వచ్చి ఢకోనడంతో ప్రభుత్వ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులతో సహా.. బస్టాప్‌లో నిద్రిస్తున్న మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మరో 40 మంది గాయపడగా.. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు బస్సు చెన్నె నుంచి మార్తాండం వెళ్తుండగా.. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

# బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ పక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

**సంగారెడ్డి,జులై13 (సింగిడి)**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మిడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు.గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి 'నువ్వు కొట్టినట్టు చెరు.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు.

# గోవధ నిషేధంపై మద్రాస్ హైకోర్టు తీర్పుపై స్టే

**న్యూఢిల్లీ,జూలై13 (సింగిడి)**


తమిళనాడులో గోవధను పూర్తిగా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు 'సవరణ' అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి విజరు నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది. బక్రీద్ పండుగ సందర్భంగా లేదా మరే ఇతర రోజుల్లోనైనా రాష్ట్రంలో ఆవులు, దూడల వధ జరగకుండా చూడాలంటూ మే 27న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజరు ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తన వాదనలను వినిపించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం.. కొన్ని నిర్దిష్ట కేటగిరీల ఆవులను, అనుమతించిన ప్రాంతాలలో వధించడానికి చట్టబద్ధమైన అనుమతి ఉందని ప్రభుత్వం పేర్కొంది. 'చట్టంలోని నిబంధనలు ఓ నిర్దిష్ట పక్రియకు అనుమతిస్తున్నప్పుడు, దానికి విరుద్ధంగా కోర్టులు న్యాయపరమైన ఆదేశాలు జారీ చేయడం చట్టబద్ధంగా చెల్లదఅని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మద్రాస్ హైకోర్టుకు చెందిన జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లకీeనారాయణలతో కూడిన ధర్మాసనం.. ఆగస్టు 1976 నాటి ఓ ప్రభుత్వ ఉత్తర్వును (ఉక్ష) ఆధారంగా చేసుకుని ఈ నిషేధాన్ని విధించింది. పాల ఉత్పత్తిని పెంచడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి 1976లో గోవధను నిషేధిస్తూ ఆ ఉత్తర్వు ఇచ్చారు. తీర్పును రాసిన జస్టిస్ స్వామినాథన్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం ఆవులు, దూడలు, ఇతర పాడి పశువుల వధను నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో కూడా శ్రీకృష్ణుని కాలం నుంచి ఆవు మన నాగరికతతో ముడిపడి ఉన్న అత్యంత గౌరవనీయమైన జంతువుగా పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు. తమిళనాడులో సంప్రదాయకంగా బక్రీద్ పండుగ సమయంలో ముస్లింలు స్థానిక నిబంధనలకు లోబడి [ ప్రైవేట్ ప్రాంగణాల్లో లేదా మతపరమైన ప్రార్థనా స్థలాలలో జంతు బలులు ఇస్తారు. అలాగే, రాష్ట్రంలోని పలు హిందూ దేవాలయాలలో జరిగే వార్షిక ఉత్సవాల్లో కూడా జంతు బలులు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఇటువంటి బలులను కేవలం లైసెన్స్ పొందిన కసాయిఖానాలకే పరిమితం చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని, పండుగ రద్దీని తట్టుకునే సామర్థ్యం ఆయా కేంద్రాలకు లేదని కమ్యూనిటీ నాయకులు వాదిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం తమ రాష్ట్రంలో 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం' ఇతర నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయని స్పష్టం చేసింది. జంతువులను ఎక్కడ, ఏ పరిస్థితులలో వధించాలనే దానిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, అయితే పూర్తి నిషేధం చట్టంలో లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతానికి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తమిళనాడులో ఈ వివాదానికి తాత్కాలిక బ్రేక పడింది.

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరసత్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభుత్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించింది. 'చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు.. తప్పుడు పత్రాలు, తప్పుడు క్లెయిమ్‌ల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందకుండా చూసేందుకు ప్రభుత్వానికి చట్టబద్ధమైన, బలమైన ఆసక్తి ఉంటుంది. అయితే, తుది విశ్లేషణలో ఆ ఆసక్తి లేదా ప్రయోజనం.. న్యాయబద్ధమైన పక్రియను అధిగమించలేవు'. అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సాబిత్రి దేరు, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీయులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. కాగా, గత జూన్ నెలలో కూడా ఇలాంటి ఒక కేసులోనే.. ఐదుగురు మహిళలను విదేశాలుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టులోని మరో బెంచ్ అడ్డుకుంది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, కేవలం పేర్ల స్పెల్లింగ్స్‌లో తేడాలు ఉన్నాయనే కారణంతో వారిని విదేశీయులుగా ప్రకటించారని అప్పట్లో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.

# విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేకఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని



కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక స్కూల్స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, జీవో జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపీఎస్ లేదా సీపీఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువు లోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) పరిధిలోనే కొనసాగుతారని జీవోలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

# ఇరాన్ రివెంజ్ లిస్ట్ కలకలం!

టెహ్రాన్: పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య మరో కీలక పరిణామం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. టెహ్రాన్ మున్సిపాలిటీకి చెందిన 'హమ్‌షాహ్రీ' పత్రిక వివాదాస్పద ప్రచురణలో 13 మంది కీలక నేతలతో కూడిన రివెంజ్ లిస్ట్‌ను ప్రకటించింది.

# సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం

కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాకకు మైనింగ్ లీజు మంజూరు కావడంలో భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ ,గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాకలే సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లకీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై వారు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి, విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరఫున సంపూర్ణ మద్దతు అందిస్తూ, సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.



# ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఒక యుద్ధం లాంటిది

**ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి**

**తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్ వెన్నెల గద్దర్**

**సర్ ప్రక్రియ వేగవంతం కోసం బీఎల్ఏలకు, నాయకులకు**

**దిశా నిర్దేశం చేసిన జగ్గారెడ్డి, నిర్మల**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 13 (సింగిడి):** ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఒక యుద్ధం లాంటిదని, దీన్ని ఎదుర్కొనేందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుని లాగా పోరాడాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ కార్పొరేషన్ చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ , ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమగ్ర సవరణ పై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బిఎల్వో లు మీ దగ్గరకు రాకున్నా మీరే వెళ్లాలని బిఎల్ఏ లు, నాయకులకు సూచించారు. ఓట్ నమోదు కాకపోతే వ్యక్తిగతంగా ఓటర్ కే నష్టం కాబట్టి ఓటర్ లు కూడా తమ ఓటహక్కును నమోదు చేసుకోవాలనే ఆతృత, ఆసక్తి ఉండాలన్నారు.

డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదురోజుల్లోనే సర్ ప్రక్రియ పూర్తి అయ్యేలా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ పని మనది, మన సంగారెడ్డి కోసం పని చేస్తున్నామనే విషయాన్ని దృష్టి లో పెట్టుకుని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు కూన వనితా సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, నాయకులు కూన సంతోష్, షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్, రఘు గౌడ్, జార్జ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**వికారాబాద్, జూలై 13(సింగిడి):** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రాంచందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులు భారీ సంఖ్యలో ఉన్నారని ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేస్తున్నారని ఎండనక, వాననక విధుల్లో ఉంటున్నారని తెలంగాణ ఉద్యమంలోనూ ప్రాణాలకు తెగించి పోరాడారని ఉద్యమం సందర్భంగా, ఆ తరువాత కూడా వందలాది మంది చనిపోయారని పరిస్థితులు మారుతున్నాయి. ప్రభుత్వాల విధానాలు మారిపోతున్నాయి తప్ప జర్నలిస్టుల బతుకుల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యూనియన్ గవర్నమెంట్ కోడ్‌ల కింద మార్చేసి హక్కులను కాలరాసిందని కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని అటు యూనియన్ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు అందడం లేదన్నారు. చివరకు వృత్తి నిర్వహణకు కావాల్సిన అక్రిడిటేషన్ కార్డులు సైతం సకాలంలో ఇవ్వడం లేదని అనేక ఉద్యమాల ఫలితంగా గత రెండు నెలల నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీచేస్తున్నారని అర్హులైన వారందరికి ఇవ్వాలనేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి ఎండి షఫీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్‌కార్డులిచ్చి ఆదుకోవాలని గత 40 ఏండ్లుగా ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని త్వరితగతిన అమలుచేయాలని జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సు పాసులు ఉచితంగా ఇవ్వాలని



అలాగే కొత్తగా మెట్రో పాసులను ఉచితంగా జారీచేయాలని ఇకపోతే కరోనాకు ముందు జర్నలిస్టులకు ఉన్న రైల్వే పాసుల సౌకర్యాన్ని యూనియన్ ప్రభుత్వం రద్దుచేసిందని దీన్ని పునరుద్ధరించేలా మోడీ సర్కార్‌పై ఒత్తిడి తేవాలని ఈ సమస్యలను వెంటనే స్పందించి సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఏడు సమస్యలను పరిస్కారం చేయాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా వర్కింగ్ జర్నలిస్టులందరికి రాష్ట్ర వ్యాప్త ఉచిత బస్ పాస్ ఇవ్వాలని కోరుతూ మేడ్చెల్, మల్కాజిగిరి, జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం ఆధ్వర్యంలో సోమవారం కూకట్ పల్లి డిపో మేనేజర్ కార్యాలయంలో ఓ ఎస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ మాసాని వెంకటయ్య, కోశాధికారి ప్రశాంత్, నాగార్జున, షబ్బీర్, చందు, నాగరాజు, రాజు, ఉపాధ్యక్షులు హాఫీజ్, భీమ్ శాప్ప, శ్రీనివాస్, అనంతయ్య, మురళి గుప్త, కృష్ణ, ఉదయ్, కార్యదర్శులు ఏ. ఆనంద్, ఎజాజ్, జి శ్రీనివాస్, కృష్ణ, అరుణ్ రెడ్డి, నాగిరెడ్డి, జగన్, శ్రీకాంత్, రాకేష్, సంతోష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో వక్తగా గీతం అధ్యాపకురాలు

**గోవాలో జరిగిన ఐసీటీ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్**

**పటాన్చెరు, జూలై 13 (సింగిడి):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఏఐఎంఎల్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్, గోవాలోని తాజ్ వివాంటాలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 11వ అంతర్జాతీయ ఐసీటీ సదస్సు, అవార్డుల ప్రదానోత్సవంలో గీతం తరఫున ఆహ్వానిత వక్తగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని సోమవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. వివిధ రంగాలలో స్మార్ట్, అనుసంధానిత, సుస్థిర పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) పరివర్తనాత్మక పాత్రను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రొఫెసర్ పర్వేకర్ ఒక విశ్లేషణాత్మక ప్రసంగం చేసినట్టు తెలియజేశారు. సాంకేతిక ఆవిష్కరణల ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఐవోటీకి పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ ప్రసంగంలో నొక్కి చెప్పారన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై చర్చించ డానికి, ఆలోచనలను



పంచుకోవడానికి, సహకార పరిశోధనలకు అవకాశాలను అన్వేషించడానికి ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విధాన రూపకర్తలు, ప్రభుత్వ ప్రతినిధులను ఒక చోట చేర్చిందని తెలిపారు. ఆవిష్కరణలను, సుస్థిర అభివృద్ధిని వేగవంతం చేయడంలో అంతర్విషయ పరిశోధన, బలమైన విద్యా-పరిశ్రమ భాగస్వామ్యాల ప్రాముఖ్యతను ఈ సదస్సు చాటిచెప్పిందన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ పరిశోధకులు, నిపుణుల అత్యాధునిక పరిశోధన కృషిని కూడా ప్రదర్శించినట్టు తెలియజేశారు. ప్రొఫెసర్ పర్వేకర్ భాగస్వామ్యం, నాణ్యమైన పరిశోధనను ప్రోత్సహించడం, ఆవిష్కరణలు పెంపొందించడం, వర్తమాన సాంకేతికతలపై ప్రపంచ చర్చలకు దోహదపడటం పట్ల గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు. ఈ సదస్సుకు హాజరైన ప్రముఖులలో గోవా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తొలి మహిళా అధ్యక్షురాలు ప్రతిమా గౌరీష్ ధోండ్; మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఏఐటీ) చైర్మన్, సలహాదారు, మెంటర్, అధ్యక్షుడు నితిన్ కుంకోలియంకర్; బెల్ గ్రేడ్ లోని సింగిడునమ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, ఏఐ ప్రాజెక్టు అధిపతి ప్రొఫెసర్ మిలన్ టూబా తదితరులు ఉన్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సర్ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన



**కుత్బుల్లాపూర్, జూలై 13 (సింగిడి):** జీడిమెట్ల డివిజన్ దుర్గా ఎస్టేట్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎన్నిమరేషన్ ఫారాలను నింపే విధానం, పోలింగ్ బూత్ వివరాలు, ఓటరు జాబితాలో పేర్ల నిర్ధారణ వంటి అంశాలపై వివరించి, గడువులోగా సంబంధిత బిఎల్ ఓలకు ఫారాలను సమర్పించాలని సూచించారు. అవసరమైన వారికి ఫారాలు అందజేసి, సందేహాలను నివృత్తి చేస్తూ సహాయ సహకారాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు.

## అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

**తోట లక్ష్మీ కాంత్ రెడ్డి**



**అల్వాల్, జూలై 13(సింగిడి):** అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోట లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారంశ్రీ లక్ష్మీ నగర్ కాలనీ ఓల్డ్ ఆల్వాల్ లో జరుగుతున్న సి సి రోడ్లను పరిశీలించిన తోట లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో కాలనీ అధ్యక్షులు బి నాగేశ్వరరావు కోరికమేరకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర డైనమిక్ లీడర్ మైనంపల్లి హనుమంతరావు సహకారంతో కాలనీలో సిసి రోడ్లు 51 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను లక్ష్మీ కాంత్ రెడ్డి సమీక్షించారు. మైనంపల్లి హనుమంతరావు సీసీరోడ్లు మంజూరీ చేయించినందుకు పని ప్రారంభించి నందుకుకాలనీ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యతతో కూడిన విధంగా సరైన విధంగా సీసీ రోడ్లు చేపట్టాలని అధికారులను కోరారు . ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బి నాగేశ్వరరావు, కాలనీ మెంబర్లు భాస్కర్ గౌడ్, నారాయణప్ప, రవి, జైపాల్ రెడ్డి, శివరాజ్, నాగన్న, రాము, మనోహర్రావు లక్ష్మీనారాయణ శ్రీనివాస్ రెడ్డి, నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఏ బ్లాక్ అధ్యక్షులు కేబుల్ శేఖర్, జిల్లా సెక్రెటరీ భబితా, సూర్య కిరణ్, దేవేందర్, నల్ల బలవంత రెడ్డి, కృష్ణ గౌడ్, లావణ్య సుకన్య అశోక్, ప్రవీణ్, మధుసూదన లు పాల్గొన్నారు.

## శివునికి విశేష అభిషేకాలు..



**అల్వాల్, జూలై 13 (సింగిడి):** ఉమా చంద్రమౌళీశ్వర ఆలయంలోసోమవారం శివునికి అద్భుతమైన రోజు అని మాస శివరాత్రి,ఆరుద్ర కార్తె ఈ మూడు ఒకే రోజున కలిసి రావడం ఎంతో విశేషమైన రోజు ఈరోజునస్పటికలింగార్చన, స్వామివారి నీ దర్శించుకున్నవారికి శుభప్రదమని అర్చకులు పేర్కొన్నారు. సందర్భంగా అన్ని శివాలయాలు భక్త జనులతో కిటకిటలాడాయి.

# సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**అల్వాల్, జూలై 13(సింగిడి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమాన్ని ఎలాంటి అశ్రద్ధకు తావులేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లకు బి ఎల్ ఎ సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీతో పాటు కొత్త ఓటర్ల నమోదు, పేర్ల చేర్పులు, మార్పులు, చిరునామా మార్పులు, షిఫ్టింగ్ అయిన ఓటర్ల వివరాల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం 192 టెంపుల్ అల్వాల్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ బీఎల్ఏలతో ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సర్ కార్యక్రమం అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై బీఎల్ఏల నుంచి వివరాలు తెలుసుకున్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేని అర్హుల నమోదు విధానం, ఒకే కుటుంబంలో కొంతమంది సభ్యుల పేర్లు మాత్రమే ఉండి మిగిలిన వారి పేర్లు లేకపోతే



అనుసరించాల్సిన విధానం, ఈసీ ఐ ఎన్ ఏటి పోర్టల్‌లో బూత్ నంబర్ నమోదు చేసినప్పుడు వేరే బూత్ వివరాలు చూపిస్తున్న సాంకేతిక సమస్య, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ కొందరికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు అందకపోవడం, వృద్ధులకు ఫారమ్‌లు అందక ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులు వంటి అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, చనిపోయిన వారు లేదా డబుల్ నమోదైన ఓటర్ల పేర్ల తొలగింపుకు ఫారం-7, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం-8 వినియోగంపై బీఎల్ఏలకు ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. బీఎల్ఏలు ప్రస్తావించిన సమస్యలను వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్ కార్యక్రమానికి ఇంకా రెండు వారాల గడువు మాత్రమే మిగిలి ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈలోపు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ పూర్తి చేయడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, షిఫ్టింగ్ అయినవారి వివరాల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్ఏలకు సూచించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి బాధ్యతతో సర్వేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోట నరేందర్ రెడ్డి, నెమూరి శ్రీధర్ గౌడ్, డోలి రమేష్, సురేందర్ రెడ్డి, సందీప్, రెహ్మత్ ఖాన్, అరుణ్, ప్రశాంత్, వీణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఓటరు జాబితా సవరణ వేగవంతం



**ఆమనగల్లు, జూలై 13(సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ప్రేమ్‌నగర్ కాలనీలోని 186వ పోలింగ్ బూత్ వద్ద ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదయ్యేలా అధికారులు విస్తృత చర్యలు చేపడుతున్నారు. ఈ బూత్‌కు బూత్ లెవల్ ఆఫీసర్ గా స్వరూప, బూత్ లెవల్ ఏజెంట్ గా ఎం. అలీమ్, సూపర్వైజర్‌గా ఎం.డి. గౌస్ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడం, వివరాలను మార్చుకోవడం, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలను పర్యవేక్షిస్తున్నారు. అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైన దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వస్పుల సాయిలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రైతన్న ఆకలి తీర్చడం మా అదృష్టం

**ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్**



**వికారాబాద్, జూలై 13(సింగిడి):** తెలంగాణ శాసనసభ సభాపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం. ప్రసాద్ కుమార్ సహాయ సహకారాలతో వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తరపున హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు 5 రూపాయల భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని ఏ ఎం సీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ వైస్ చైర్మన్ పి. మల్లేశం తెలిపారు. సోమవారం స్వయంగా మార్కెట్ యార్డులో రైతులకు భోజనం వడ్డించి రైతుల నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పాలకవర్గం ఏర్పాటు అయినా వెంటనే చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ప్రతి సోమవారం, గురువారం రైతులకు 5 రూపాయల మధ్యాహ్న భోజన కార్యక్రమంఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. దేశ ప్రజల కడుపు నింపే రైతన్నల ఆకలి తీర్చడం వారికి సేవ చేయడం మా పాలకవర్గం అదృష్టంగా భావిస్తున్నామని ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలియజేసారు. త్వరలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో రైతు బజార్ బీట్లలో రైతులకు అల్పాహారం అందించే కార్యక్రమం కూడా ప్రారంభిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సీ డైరెక్టర్ వట్టం నర్సిములు, విజయ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ క్రీడాకారులను.. ఉత్తమ అధికారులను అభినందించిన ఎస్పీ

**వికారాబాద్, జూలై 13(సింగిడి):** వికారాబాద్ జిల్లాకు చెందిన ఐదు గురు పోలీస్ అధికారులకు ప్రతిష్టాత్మక తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాల అందుకున్నారు. ఐదవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్‌లో 8 పతకాలు (3 రజత, 5 కాంస్య) సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన క్రీడాకారులను వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు అందించిన ఐదుగురు పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను, అలాగే ఇటీవల నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026 (క్లస్టర్-ఏ లో మొత్తం 8 పతకాలు (3 రజత, 5 కాంస్య) సాధించిన ఎనిమిది మంది పోలీస్ క్రీడా కారులను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఎ. శ్రవణ్ కుమార్ ఏ ఎస్ ఐ జి. ప్రకాష్ ఏ ఆర్ ఎస్ ఐ లు కె. మోహన్ రాజ్ పి. సంజీవయ్య, ఎస్. విఠలయ్య లకు ఎస్పీ పతకాలను అందజేశారు, అలాగే క్రీడల్లో రాణించిన డబ్ల్యూపి సీ స్రవంతి, పి సీ శివదర్శన్, పి సీ మహేందర్, డబ్ల్యూ పి సీ రేణుక, డబ్ల్యూ పి సీ కవిత, డబ్ల్యూ పిసి వినోద, పి సీ జై ఆనంద్, పి సీ శ్రీనివాస్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ



సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సేవా పతకాలు అందుకోవడం ప్రతి అధికారి విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపని, ఇది ప్రజలకు మరింత బాధ్యతతో సేవలు అందించేలా ప్రేరేపిస్తుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జిల్లా ఖ్యాతిని పెంచడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యాన్ని, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచు కుంటూ రాబోయే జాతీయ స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి





**• అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశం**

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 13 (సింగిడి):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి లతో కలిసి అదనపు కలెక్టరు (78) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## ఆత్మరక్షణలో కాంగ్రెస్!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళేశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపో యారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది. మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా... ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్‌గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికా రంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుం బాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగి పారేసిన నాదర్‌గుల్ రైతులురాజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్‌గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపిం చారు. ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలా సేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు. ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొ ట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# కవిత్వంతో ఉద్యమ చైతన్యాన్ని నింపిన గరిమెళ్ల

## జూలై 14... గరిమెళ్ళ సత్యనారాయణ జయంతి

స్వాతంత్ర్యోద్యమంలో "వందే మాతరం" ఎలా నినాదంగా, ఉత్ప్రేరకంగా పని చేసిందో... అలాగే ఆయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" పాట ప్రతి తెలుగువారి నోటా మార్మోగింది. ఒక విప్లవ గీతమైంది. అలాంటి ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ. తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడి పెట్టిన కవి ప్రముఖుడు గరిమెళ్ళ. సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని కోరినప్పుడు, ఇంగ్లీష్ లోకి అనువదించి టంగుటూరి ప్రకాశం పంతులు "స్వరాజ్యం" పత్రికలో ప్రచురించాడు.

స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్ట, అగ్ర స్థానం. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడు గరిమెళ్ళ. అయన గేయాలు జాతీయ వీరరసంతో తొణికిస లాడుతూ పాఠక జనాన్ని ఉర్రూత లూగించాయి. 29 ఏళ్ళకే గేయాలు, రచనలు చేశాడు. స్వాతంత్ర్య పోరాటకాలంలో



అయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. తన కవితలతో ఎందరినో స్వాతంత్ర్య పోరాటం పట్ల కార్యోన్ముఖులను చేసిన మార్గ దర్శకుడు. ఎందరికో మార్గదర్శకు డైన పోరాట యోధుడు. పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు. ఇంకెందరిలోనో చైతన్య దీపాలను వెలిగించి, సత్యాగ్రహ బాట పట్టించిన స్ఫూర్తి ప్రదాత. నీతికీ నిజాయితీకి నిలువుటద్దం. దేశభక్తి గీతాలు రాసిన నేరానికి పలు మార్లు జైలు కెళ్ళినా, రాయడం మానని ధీరుడు.

గరిమెళ్ళ గేయాలు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజా హృదయంలోకి శరవేగంగా చొచ్చుకు పోయాయి. స్వరాజ్య గీతాలు, గేయాలు, వ్యాసాలు పదునైన ఛలోక్తులకు ఆయనకు ఆయనే సాటి.

గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తా నుండి, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకునిగా, ఆనంద వాణికి సంపాదకునిగా ఏ విధులు నిర్వర్తించినా, నిజాయితీకి నిర్భీతికి నీతికి ప్రతీకగా నిలిచాడు.

అయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" .... " అలాగే "దండాలు దండాలు భారత మాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఉరికే తెగువను కలగ జేసింది. నిజాయితీకి, నిర్భీతికి గరిమెళ్ళ మారు పేరుగా నిలిచాడు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగు వాడి నోటా మారు మోగేది. ఆయనంత ప్రసిద్ధినొందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరులేరు.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుక గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించాడు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయ నగరం, మచిలీ పట్నం, రాజమహేంద్ర వరం మొదలైనచోట్ల ఉన్నత చదువులు చదివాడు. బి.ఏ. చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పని చేశాడు. ఆ తరువాత విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశాడు. అయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కువకాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేక పోయాడు.

1920 డిసెంబర్?లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయ నిరాకరణ తీర్మానం అమోదించ బడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ "మా కొద్దీ తెల్లదొరతనం" పాటను రాశాడు. పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించింది. ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా ( 12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆనోటా – ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నాడట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా అయినందున తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగా, గరిమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష తనకు రాకపోయి నప్పటికీ, ఈ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్య పరచ గలదో నేను ఊగించగల నన్నాడట. ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధీటోపి పెట్టుకుని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగర వేసుకుంటూ...మాకొద్దీ తెల్లదొరతనం – దేవమాకొద్దీ తెల్లదొరతనం అంటూఆకాశం దద్దరిల్లేలా పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారట. శిక్షపూర్తి చేసుకుని జైలు నుంచి విడుదల అయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకో సాగాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి ఆయనను అరెస్టు చేశారు. కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. మేజిస్ట్రేట్ రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష విధించాడు.

గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే విడుదల చేస్తామని చెప్పారట. కాని గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నాడు. అంతటి దేశభక్తుడు ఆయన.

జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు ఆయనకు ఎన్నోచోట్ల సన్మానాలు చేశారు. ఆయన జీవితంలో మధుర ఘట్టం ఇదొక్కటే. అప్పులు పెరగడంతో ఉన్న ఆస్తి అమ్మేసి అప్పులు తీర్చాడు. ఉద్యోగం వదిలేశాక కొంతకాలం ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేశాడు. శ్రీ శారదా గ్రంథమాల స్థాపించి పద్దెనిమిది పుస్తకాలు అచ్చువేశాడు. అవి అమ్ముడు పోలేదు. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, పట్టించు కోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి. వాటి వల్ల కూడా కొంత నష్టం వచ్చింది.

1921లో గరిమెళ్ళ 'స్వరాజ్య గీతములు ' పుస్తకం వెలువడింది. 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలు శిక్ష అనుభవించాడు. జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు నేర్చుకున్నాడు. తమిళ, కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువ దించాడు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశాడు. ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన 'ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువ దించాడు. 1937లో చీనా–జపాన్ అనే పుస్తకాన్ని రచించారు. గరిమెళ్ళ జీవనోపాధి కోసం 1933లో మద్రాసు చేరుకున్నాడు. అక్కడ గృహలక్ష్మి పత్రిక సంపాదకుడుగా ఉద్యోగంలో చేరాడు. కొంతకాలం తరువాత అక్కడ మానివేసి ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకుడుగా చేరాడు. కొద్ది రోజులతర్వాత ఆంధ్రప్రభలో చేరాడు. కొంతకాలం ఆనందవాణికి సంపాదకుడుగా పనిచేశాడు. కొంతకాలం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించాడు.

స్వాతంత్ర్యానంతరం పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకో తగిన సహాయం లభించలేదు. దాంతో కొంతమంది మిత్రులు గరిమెళ్ళను 'మాకొద్దీ నల్ల దొరతనం ' అనే గేయం రాయమని అడిగారట. దేశ భక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట.

గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయ పడ్డాడు. వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు ఆర్థిక సహాయం చేసేవాడు. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది. దిక్కులేని పరిస్థితుల్లో కొంతకాలం యాచన మీద బ్రతికాడు. జీవిత చరమాంక దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన గరిమెళ్ళ 1952 డిసెంబర్ 18వ తేదీన స్వగ్రామంలో మరణించాడు. పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలి పోయాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**



### మా పోరాటం వల్లనే

# రైల్వేజోన్ వచ్చింది

## శిక్ష కేసును హైకోర్టులో సవాల్ చేస్తా: గుడివాడ

**విశాఖపట్టణం, (సింగిడి ):**అప్పట్లో రైల్వేజోన్ కోసం పోరాటం చేయడం వల్లే ఇప్పుడు విశాఖకు జోన్ వచ్చిందని వైకాపా నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ అన్నారు. విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ కేటాయిం చాలని కోరుతూ 2016 ఏప్రిల్‌లో అమర్‌నాథ్ ఆందోళనలు నిర్వహించారు. స్థానిక జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమ రణ నిరాహార దీక్ష చేశారు. ఈ ఘటనపై అప్పట్లో టూటౌన్ పోలీ సులు కేసు నమోదు చేశారు. ఈకేసులో గుడివాడకు 6నెలల జైలు శిక్షతోపాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ.. విశాఖపట్నంలోని రెండో అదనపు ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి వరలక్ష్మి తీర్పు ఇచ్చారు. విచారణ పూర్తవడంతో, సాక్ష్యా ధారాలను పరిశీలించిన న్యాయ మూర్తిమాజీ మంత్రికిశిక్షవిధిస్తూ తీర్పుఇచ్చారు. దిగువ న్యాయస్థానంవెలువరించిన తీర్పు పైహై కోర్టులో అప్పీలుకు వెళ్తానని అమర్ నాథ్ పేర్కొన్నారు. ఇదిప్రజల కోసం చేసిన పోరాటమని అన్నారు.



# పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ సంక్షోభం...

## ఇరాన్–అమెరికా మధ్య తీవ్రస్థాయిలో దాడులు

**ప్రస్తుత పరిస్థితి ఏంటి?**
జూన్ 2026 చివరి వారంలో ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా కూలిపోయింది. రెండు దేశాలు మళ్ళీ క్షిపణులు, డ్రోన్లతో ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటున్నాయి.

**అమెరికా దాడులు:**
ఇరాన్ లోని క్విష్మ, బండార్, అబ్బాస్, అబ్దాన్, లాంటి దక్షిణ ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై, వైమానిక రక్షణ వ్యవస్థలు, కోస్టల్ రాడార్లు, క్షిపణి–డ్రోన్ నిల్వలపై దాడి చేసింది.

ఇరాన్ ప్రతిదాడి: బహ్రెయిన్, కువైట్ లోని అమెరికా సైనిక స్థావరాలను, ఒమన్ లో రాడార్లను, జోర్డాన్ లోని ప్రిన్స్ హసన్, ఎయిర్ బేస్ లో
లో ఇంధన ట్యాంకులను లక్ష్యంగా చేసుకుంది. బహ్రెయిన్ పై డ్రోన్ దాడి జరిగినట్టు ఆ దేశం కూడా ఆరోపించింది.

**హోర్ముజ్ జలసంధి – సంక్షోభానికి కేంద్రం**
ఇరాన్ వీకెండ్ లో "హోర్ముజ్ జలసంధి మూసివేత" ప్రకటించింది. ప్రపంచంలో 20% చమురు ఇదే మార్గం నుండి వెళ్తుంది.

**ఫలితం:**
చమురు ధరలు పెరిగాయి, దీతీవత్ వ79.11 కి చేరింది, 4.08% పెరుగుదల
సైప్రస్ సరుకు ఓడపై దాడి: ఇంజిన్ రూమ్ దెబ్బతింది, ఒక సిబ్బంది కనిపించడం లేదు. 10 మంది భారతీయులను రక్షించారు. గల్ఫ్ మార్కెట్లు పతనం – సౌదీ, దుబాయి, అబుదాబి స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ఉన్నాయి. ట్రంప్ "అమెరికాయే హోర్ముజ్ ని నియంత్రిస్తుంది" అనగా, ఇరాన్ "అమెరికాకు అధికారం లేదు" అని తిప్పికొట్టింది.

**ఒప్పందం ఎందుకు విఫలమైంది?**
గత నెల జూన్ 18న ఖతార్, పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో 60 రోజుల ఒప్పందం కుదిరింది. కానీ హోర్ముజ్ నియంత్రణపై విభేదాలు. "రోగ్యూ ఫ్యాక్షన్" అంటే తీవ్రవాద ఇరాన్ గ్రూపులు ఒప్పందాన్ని పాడుచేస్తున్నాయని అమెరికా ఆరోపణ. ట్రంప్ "వాళ్ళు ఎప్పుడూ ఒప్పందాన్ని బ్రేక్ చేస్తారు" అంటూ "చాలా గట్టిగా కొడతాం" అని హెచ్చరించారు.


**ప్రపంచంపై ప్రభావం...**

ఆర్థికం: చమురు, గ్యాస్, రవాణా ఖర్చులు పెరుగుతాయి. స్టాక్ మార్కెట్లు బలహీనపడతాయి. ప్రపంచ ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం.
రాజకీయం: టర్కీ కాల్పులు ఆపమని కోరింది. చైనా "కాల్పుల విరమణ కొనసాగాలి" అంది. భారత్ 3 భారతీయ సిబ్బంది ఉన్న సరుకు ఓడలపై దాడి జరిగిందని ఎం ఈ ఎ బలంగా నిరసన తెలిపింది.

**తదుపరి ఏమిటి?**
చర్చలు... జూన్ 30న ఖతార్ లోని దోహాలో సాంకేతిక చర్చలు జరగాల్సి ఉంది. కానీ ఇప్పుడు అనుమానంగా ఉంది.

**ఇరాన్ హెచ్చరిక...**
ఐ ఆర్ జి సీ చీఫ్ "అమెరికా హోర్ముజ్ ని అసురక్షితం చేస్తే, మొత్తం ప్రాంతాన్ని నరకం చేస్తాం" అన్నారు. ట్రంప్ ఆప్షన్లు. "లొంగిపో, హోర్ముజ్ ని స్వాధీనం చేసుకో, లేదా మరిన్ని బాంబులు" అనే 3 ఆప్షన్లు ఉన్నాయి.

ఇది ఇకపై కేవలం ఇరాన్–అమెరికా యుద్ధం కాదు. హోర్ముజ్ మూసివేతతో ఇది ప్రపంచ ఆర్థిక యుద్ధంగా మారుతోంది. ఒమన్ మధ్యవర్తిత్వం కూడా విఫలమైంది. పాకిస్తాన్ "శాంతి దూత" అని చెప్పుకుంటున్నా, క్షేత్రంలో దాడులు ఆగడం లేదు. 24 గంటల్లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. హోర్ముజ్ తెరుచుకుంటుందా, లేదా పూర్తి స్థాయి యుద్ధమా అనేది వచ్చే వారంలో తేలనుంది.



**ఉక్కల్కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్..**
**9440287170.**

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 14-7-2026

## అమరవీరుడు కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

మనవడు వేదాంత్ రాఘవకు ఆశీర్వాదం

డాక్టర్ ప్రియాంక వైద్య ఉన్నత విద్యకు కేసీఆర్ ప్రకటించిన ఆర్థికసాయం చెక్కు అందజేత



**కరీంనగర్, జులై 13(సింగిడి):** భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి. రామారావు (కేటీఆర్) సోమవారం రోజున కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యమ అమరవీరుడు, దివంగత కానిస్టేబుల్ కిష్టయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కిష్టయ్య సతీమణి పద్మావతి, కుమారుడు రాహుల్, కోడలు వర్ష, కుమార్తె డాక్టర్ ప్రియాంకలతో ఆత్మీయంగా మాట్లాడిన కేటీఆర్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జన్మించిన మనవడు వేదాంత్ రాఘవ కిష్టయ్యను ఆశీర్వదించి, చిన్నారికి వస్త్రాలు, కానుకలు, కిష్టయ్య పేరులోని 'కె' అక్షరంతో రూపొందించిన ప్రత్యేక లాకెట్‌తో పాటు కేసీఆర్ కిట్‌ను అందజేశారు. అలాగే, డాక్టర్ ప్రియాంక వైద్య ఉన్నత విద్య (పీజీ) కోసం భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా ఫీజుల చెక్కును కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా అమరవీరుడు కిష్టయ్య కుటుంబానికి భారత రాష్ట్ర సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. తమ కుటుంబాన్ని పరామర్శించి, మనవడిని ఆశీర్వదించడంతో పాటు కుమార్తె విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం అందించిన కేటీఆర్‌కు కిష్టయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ , భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ



**జమ్మికుంట, జులై 13 (సింగిడి):** జమ్మికుంట పట్టణ పరిధిలోని బాలుర పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు డి - వార్మింగ్ నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేసిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ప్రతి విద్యార్థిని విద్యార్థులకు డి-వార్మింగ్ నులిపురుగుల నివారణ మందులు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఈ మందులను వేసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి మాట్లాడుతూ, నులి పురుగు మాత్రలు తప్పకుండా ప్రతి విద్యార్థికి అందేలా పాఠశాల ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని పిల్లల్లో ఉన్న అపోహలు తొలగించి వారికి ఈ మందులను వెయ్యాలని తెలిపారు. నులి పురుగు మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండాలని పిల్లల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మాచర్ల రాజు, మండల విద్యాధికారి మంతెన హేమలత, ఉపాధ్యాయులు బాదం సురేష్,వైద్యురాలు చందన, ఏఎన్ఎం ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



### కాళేశ్వరం పంపులు ప్రారంభించి

# రైతులకు నీళ్లు ఇవ్వాలి

**ఎల్ఎండీతో పాటు తొమ్మిది నియోజకవర్గాలకు తాగునీటి ముప్పు ఉందని హెచ్చరిక**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ముందుకు వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలను వివరిస్తే కాంగ్రెస్ నాయకులకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డిని కాళేశ్వరం అంశంతో అనుసంధానం చేస్తూ బెదిరించడం బాధాకరమని పేర్కొన్నారు.

**మాజీ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డిని కాళేశ్వరం అంశంతో బెదిరించడం బాధాకరం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్**

**కరీంనగర్, జులై13(సింగిడి ):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ముందుకు వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలను వివరిస్తే కాంగ్రెస్ నాయకులకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డిని కాళేశ్వరం అంశంతో అనుసంధానం చేస్తూ బెదిరించడం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందే ఉద్యోగ విరమణ చేసిన తనను కూడా ఈ వ్యవహారంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని శ్యామ్ ప్రసాద్ రెడ్డి తనతో ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. రాజకీయ విమర్శల కంటే రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని జలాశయాలు, బ్యారేజీలు, పంపు గృహాలు, కాలువలు, మోటార్లు, విద్యుత్ ఉపకేంద్రాలు సక్రమంగానే ఉన్నాయని, ప్రభుత్వం సంకల్పంతో పంపులు ప్రారంభిస్తే వెంటనే రైతులకు నీరు అందించవచ్చని చెప్పారు. సీఎం పంపులు ప్రారంభించి రైతులకు నీళ్లు ఇస్తే రాజకీయ విమర్శలు చేయబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం గోదావరి పరివాహక ప్రాంతంలోని కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్, అప్పర్ మానేర్, మిడ్ మానేర్, అన్నారం తదితర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు సుమారు తొమ్మిది టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా ప్రభుత్వం వినియోగించుకోవడంలో విఫలమైందని విమర్శించారు. దిగువ మానేరు జలాశయానికి వెంటనే కాళేశ్వరం ద్వారా నీటిని తరలించకపోతే కరీంనగర్‌తో పాటు ఎల్ఎండీపై ఆధారపడిన తొమ్మిది నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతుల సాగునీటి అవసరాలతో పాటు ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం పంపులను ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, గంగుల కమలాకర్, హుజురాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కెడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, వీర్ల వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

### కలెక్టరేట్ ఎదుట ధర్నా

**కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన టిడబ్ల్యూజేఎఫ్ సంఘం**



**కరీంనగర్,జులై13(సింగిడి):** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొమ్మెర తిరుపతి రెడ్డి, జిల్లా నాయకుడు బండోజు శ్రీకాంత్ మాట్లాడుతూ, పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, అర్హులైన పేద జర్నలిస్టులకు గృహ నిర్మాణ సహాయం అందించాలని కోరారు. సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించక పోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లాలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జయేందర్, రమణ, శ్రీనివాస్, సతీష్, అరవింద్, సంపత్, రవీందర్, ప్రవీణ్ రెడ్డి, శాంతికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

రైతుకు న్యాయం చేస్తామని విద్యుత్ అధికారుల హామీ



**ములుగు ప్రతినిధి, జులై 13 (సింగిడి):** మంగపేట మండలం చెరుపల్లి గ్రామంలో సోమవారం ఉదయం త్రీఫేస్ కరెంటు సరఫరా సమయంలో రైతు బరపటి నరసింహారావు గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సమాచారం అందిన వెంటనే విద్యుత్ శాఖ ఏఈ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రైతుకు జరిగిన నష్టానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఈ భరోసా ఇచ్చారు. అధికారుల వేగవంతమైన స్పందనను గ్రామస్తులు అభినందించారు.

## నేరాల అదుపునకు సాంకేతికతకు పెద్దపీట

### అర్ధవార్షిక నేరాల సమీక్షలో అధికారులకు కీలక ఆదేశాలు

**పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, జూలై 13(సింగిడి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ అధ్యక్షతన 2026 తొలి అర్ధవార్షిక నేరాల సమీక్షా సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025, 2026 తొలి అర్ధవార్షిక నేరాల గణాంకాలను సమీక్షించిన సీపీ, నేరాల పెరుగుదల, తగ్గుదలకు గల కారణాలను విశ్లేషించి, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేసి, నిర్దేశిత గడువులో అభియోగపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, పోక్సో చట్టానికి సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాల ఛేదనతో పాటు బాధితులకు చోరీ సొత్తును త్వరగా అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్ చోరీల నియంత్రణకు సంబంధిత పోర్టల్ వినియోగాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతిక వేదికలను విస్తృతంగా వినియోగించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు, భౌగోళిక గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై కఠిన చర్యలతో పాటు యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి సరిదిద్దాలని, హిట్ అండ్ రన్ కేసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. అక్రమ ప్రజా పంపిణీ బియ్యం రవాణా, ఇసుక అక్రమ రవాణా, జూద నిర్వహణపై ఉక్కుపాదం మోపాలని, రాత్రి గస్తీని పెంచి ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన చూపాలని సూచించారు. ఇతర రాష్ట్రాల గృహ కార్మికులు, నేపాలీ పౌరుల వివరాలను నమోదు చేయడంతో పాటు సామాజిక మాధ్యమాలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి కేసును శాస్త్రీయంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా, నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, మాధవి, యాదగిరిస్వామి, శ్రీనివాస్ జి, వేణుగోపాల్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ... భవిష్యత్ తరాలకు రక్షణ





• జల ప్రతిజ్ఞ చేయించిన చైర్మన్ ప్రశాంత్ కుమార్

**జమ్మికుంట జులై 13 (సింగిడి):** నీటి సంరక్షణ చేయడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో గాను ఉపయోగపడతాయని అది ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తుంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నీటి సంరక్షణ పై చైర్మన్ ప్రశాంత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడడంతో పాటు అవసరమైనంత వరకు మాత్రమే వినియోగించుకోవాలని ప్రతి చుక్కను సంరక్షించి జల్ శక్తి అభియాన్ వర్షాన్ని పట్టుకోండి అనే ప్రచారాన్ని ప్రోత్సహించాలని కోరారు. నీటిని ఒక వనరుగా భావించి దానిని అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడంతోపాటు వృధా చేయకుండా ఉండాలని ప్రతి ఒక్కరికి నీటి యొక్క ఉపయోగాలను తెలియజేయాలని కోరారు. ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించే బాధ్యతను ఒక ఉద్యమంగా భావించి ముందుకు సాగాలని ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించు కోవాలని సూచించారు. ప్రతి అవసరానికి నీరు చాలా ప్రాధాన్యమని అత్యంత ప్రాధాన్యంగా ఉన్న నీటిని అవసరం మేరకు మాత్రమే ఉపయోగిం చుకొని మిగతా నీటిని ఆదా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ రాజిరెడ్డి ,టి పి ఓ శ్రీధర్ ,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు

### రాజకీయ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణరావు**



**కరీంనగర్, జులై 13(సింగిడి):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, కె.టి. రామారావుపై చేసిన వ్యాఖ్యలు అనుచితమైనవి, రెచ్చగొట్టే స్వభావం కలిగినవని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కేడీసీసీ బ్యాంకు ఉపాధ్యక్షుడు పింగిలి రమేష్, బీఆర్ఎస్వీ నాయకుడు పొన్నం అనిల్ కుమార్ కలిసి ఈ ఫిర్యాదు సమర్పించారు. రాజ్యాంగబద్ధమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల్లో విద్వేషాన్ని రెచ్చగొట్టే అవకాశం ఉండటంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత--2023లోని సంబంధిత నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రానికి అనుగుణంగా నిష్పాక్షికంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ముఖ్యమంత్రి రాజకీయాల్లో హుందాతనం, బాధ్యతాయుతమైన భాషను పాటించాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటూ, తమ ఫిర్యాదుపై పోలీసులు నిష్పాక్షికంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### చొప్పదండి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

కలెక్టర్ చిత్రా మిశ్రాకు ఎమ్మెల్యే వినతి




**కరీంనగర్, జూలై 13 (సింగిడి):** చొప్పదండి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కోరారు. సోమవారం రోజున కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవల మెరుగుదలపై వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, యూరియా కొరత రాకుండా తగిన నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. అలాగే విద్య, వైద్యం, రవాణా రంగాల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసర మైన సౌకర్యాలు కల్పించి, విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పందిస్తూ, చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుం టామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యా చరణతో ముందుకు సాగుతామని తెలిపారు.

### ప్రతిభావంతులైన క్రీడాకారులకు

## ఎల్లప్పుడూ ప్రోత్సాహం

**సీపీ అంబర్ కిశోర్ ఝా**





**గోదావరిఖని, జూలై 13 (సింగిడి):** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 క్లస్టర్--ఏ పోటీల్లో కాళేశ్వరం జోన్ 48 పతకాలు సాధించడం గర్వకారణమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పతక విజేతలను సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో అభినందిస్తూ, క్రీడల్లో ప్రతిభ కనబరిచే పోలీస్ సిబ్బందికి శాఖ తరపున పూర్తి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కాళేశ్వరం జోన్ నుంచి 51 మంది పాల్గొనగా 31 మంది క్రీడాకారులు 8 బంగారు, 16 వెండి, 24 కాంస్య పతకాలతో మొత్తం 48 పతకాలు సాధించారు. క్రీడలు క్రమశిక్షణ, జట్టు సమన్వయం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించి విధి నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని సీపీ పేర్కొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
14-7-2026



రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పటాన్ చెరులోని ఇక్రిశాట్ లో రాష్ట్రస్థాయి వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, వాతావరణ తదితర అనుబంధ శాఖల ఉన్నతాధి కారులతో "రాష్ట్రంలో ఎల్‌నినో నేపథ్యంలో కంటింజెన్సీ ప్లానింగ్" పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశాలు, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం, భూగర్భ జలాల లభ్యత, ఖరీఫ్ పంటలపై ప్రభావం, రైతులకు అందించాల్సిన సాంకేతిక సూచనలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.



## ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు..

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు

### మూడు దశల్లో కంటింజెన్సీ ప్లాన్ అమలు

### రైతులకు ముందస్తు అవగాహన

### పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో మంత్రి నాగేశ్వరరావు రాష్ట్రస్థాయి సమీక్ష

**సంగారెడ్డి బ్యూరో, జులై 13 (సింగిడి):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పటాన్ చెరులోని ఇక్రిశాట్ లో రాష్ట్రస్థాయి వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, వాతావరణ తదితర అనుబంధ శాఖల ఉన్నతాధి కారులతో "రాష్ట్రంలో ఎల్‌నినో నేపథ్యంలో కంటింజెన్సీ ప్లానింగ్"పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశాలు, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం, భూగర్భ జలాల లభ్యత, ఖరీఫ్ పంటలపై ప్రభావం, రైతులకు అందించాల్సిన సాంకేతిక సూచనలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రామాణికంగా తీసుకుని మూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. వర్షపాత పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ ప్రతి జిల్లాకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ముందస్తుగా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాలుగా మారిన నేపథ్యంలో శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అనుసరించాలని తెలిపారు. వర్షాలు ఆలస్యమైనా లేదా తక్కువగా కురిసినా రైతులు ఇబ్బందులు పడకుండా వరికి బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, వేరుశనగ, పెసలు, మినుములు, కందులు, సజ్జలు, జొన్నలు వంటి తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అలాగే తక్కువ కాల వ్యవధిలో దిగుబడి ఇచ్చే స్వల్పకాలిక విత్తనాలను అందుబాటులో ఉంచి రైతులకు అవసరమైన విత్తనాల సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, నీటి లభ్యత ఆధారంగా ఏ పంటలు సాగు చేయాలో రైతులకు స్పష్టమైన సూచనలు అందించాలని, వాతావరణ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖల నుంచి రోజువారీ సమాచారం సేకరించి రైతులకు చేరవేయాలని మంత్రి తెలిపారు. వాతావరణ సమాచారం, వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల స్థితి వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులు ముందస్తు నిర్ణయాలు తీసుకునేలా చూడాలని సూచించారు. వ్యవసాయ శాఖ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న కంటింజెన్సీ ప్లాన్‌ను వెంటనే విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

సమావేశంలో ఇక్రిశాట్, భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్, ఐఐఓఆర్, ఐఐఎంఆర్ తదితర సంస్థల శాస్త్రవేత్తలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం అంచనాలు, పంటలపై ప్రభావం, తేమ సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల, పంటల వైవిధ్యీకరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయం పై వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సహకారంతో ప్రతి జిల్లాకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ & సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, ఉద్యాన & సెరికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష, స్పెషల్ కమిషనర్ & రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ రాహుల్ రాజ్, వ్యవసాయ & పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ బి. గోపి, టీజీఎస్‌డబ్ల్యూసీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. లక్ష్మి, టీజీఎస్పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, హాకా మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్, భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, అలాగే వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, భూగర్భజలాలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హామీలను వెంటనే అమలు చేయండి

### టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా



**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 13 (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇచ్చిన సంక్షేమ హామీలను వెంటనే అమలు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టు సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ముందు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలు చేయాలని మీడియా స్వేచ్ఛను కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టి డబ్ల్యూ జేఎఫ్ పిలుపుమేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు తమ సమస్యలను పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్. కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ కార్యదర్శి బాణావత రవి నాయక్ మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ కార్డులు హెల్త్ కార్డులు ఇవ్వాలని, వారి పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీలు ఇండ్ల స్థలాలకు హామీలు, ఇచ్చిన హామీలను వెంటనే తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నియోజకవర్గ ఇన్చార్జిలు నాయకులు పెద్ద సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.




# లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 12(సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రీ-సర్వే కార్యక్రమంపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్డ్ సర్వేయర్లు తప్పక రీ సర్వేలో పాల్గొనాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోగా విధులకు హాజరూవాలని ఆదేశించారు. శాస్త్రీయంగా సర్వే నిర్వహించడం ద్వారా ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎంతో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి ఇదొక గొప్ప అవకాశమని, సర్వేయర్లు అందరూ తప్పకుండా ఈ రీ-సర్వేలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మొత్తం 91 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారంతా రీ-సర్వే విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ లోపు విధులకు హాజరుకాని సర్వేయర్ల లైసెన్స్‌లను రద్దు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.



జిల్లా వ్యాప్తంగా ప్రాథమికంగా 7 గ్రామాలలో ఈ రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించడంలో సర్వేయర్ల పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని, ఈ బాధ్యతగా గుర్తించి సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**అమీన్ పూర్, జులై 13(సింగిడి):** అమీన్‌పూర్ లింగంపల్లి నుండి అమీన్‌పూర్ మీదుగా సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ వరకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని, ఈ మార్గంలోని రేడియల్ రోడ్డు పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు. అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నేతలు, కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం బీరంగూడ కమాన్ నుండి కృష్ణారెడ్డిపేట మీదుగా సుల్తాన్‌పూర్ ఎగ్జిట్‌కు చేరుకోవడానికి ప్రయాణికులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారని, నిరంతరం భారీ ట్రాఫిక్‌తో ఈ రహదారి కిక్కిరిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లింగంపల్లి నుండి బంధంకొమ్ము, అమీన్‌పూర్ మీదుగా ఐలాపూర్ తండా నుండి సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కు రోడ్డు సౌకర్యం కల్పిస్తే వేలాది మంది ప్రయాణికులకు సమయం, ఇంధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు.

**ఐలాపూర్ తండా వద్ద అక్రమ నిర్మాణాలు..**

లింగంపల్లి నుండి అమీన్‌పూర్ వరకు 150 ఫీట్ల రోడ్డు పనుల కోసం ప్రజాప్రతినిధులు, మంత్రులు ఇప్పటికే రూ. 45 కోట్ల నిధులతో



పనులు ప్రారంభించారని నేతలు గుర్తుచేశారు. అయితే, మాస్టర్ ప్లాన్ రేడియల్ రోడ్ నెం. 31 (100 ఫీట్ల రోడ్డు) పరిధిలోని ఐలాపూర్ తండా వద్ద రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో హైడ్రా అధికారులు ప్రభుత్వ, చెరువు భూముల రక్షణ కోసం ఐలాపూర్ తండా పరిధిలో ఏర్పాటు చేసిన కంచెను సైతం దాటి కొంతమంది బిల్డర్లు అక్రమంగా నిర్మాణ పనులు చేపడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అమీన్‌పూర్ చౌరస్తా నుండి పీఎన్ఆర్ కాలనీ మీదుగా ఐలాపూర్ తండా ద్వారా సుల్తాన్‌పూర్ రింగ్ రోడ్డును కలిపితే కేవలం ఐదు నిమిషాల్లో ఓఆర్ఆర్‌కు చేరుకునే అవకాశం ఉంటుందని, కానీ ఈ అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐలాపూర్ తండాలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, రేడియల్ నెంబర్ 31 మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యమే ప్రాధాన్యం..

### ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, జూలై 13(సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని పిల్లలకు మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే మంచి విద్యాభ్యాసం సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి, పోచమ్మ దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక



**కుత్బుల్లాపూర్, జులై 13 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 128 – చింతల్ డివిజన్ ఎన్ ఎల్ బి నగర్ "శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం, పోచమ్మ దేవస్థానం నూతన కమిటీ సభ్యులు" పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పిఎప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు. ఆలయ అభివృద్ధిలో కమిటీ సభ్యులకు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ ఎం. బసవరాజ్, సలహాదారులు జేమ్స్, ఆకుల ప్రభాకర్ గుప్తా, ప్రెసిడెంట్ వేముల నాగరాజు గుప్తా, వైస్ ప్రెసిడెంట్ గుంజరి నరేష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. వెంకటేష్, జనరల్ సెక్రెటరీ జి. క్రిష్ణ, ట్రెజరర్ వి. కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి




**ఆమనగల్లు, జూలై 13(సింగిడి):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలోని లయన్స్ క్లబ్ రామ్ రెడ్డి విజన్ సెంటర్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాముతో కలిసి క్లబ్ కార్యదర్శి గంగుల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వృద్ధాప్య దశలో కంటిచూపు మందగించిన వారిని క్యాంపుల ద్వారా గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 18 మందిని ఐఓఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ నటరాజ్ బి యాదయ్య, ఐదవ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, కంటి వైద్య నిపుణులు ఎం చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు లయన్ చుక్కా అల్లాజీ గౌడ్, కర్నాటి కొండల్ రెడ్డి, క్లబ్ పి ఆర్ ఓ ఎం ఏ పాష, శిరీష ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్త ఉచిత బస్ పాసులు ఇవ్వాలి : టీడబ్ల్యూజేఎఫ్

**కూకట్‌పల్లి, జూలై 13 (సింగిడి) :** వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర వ్యాప్త ఉచిత బస్ పాసులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కూకట్ పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయ ఓఎస్ కు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్న జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసులు ఇస్తే నష్టం లేదని తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా మాయొక్క జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీపై ప్రయాణ సదుపాయం అమలు చేయడం మంచిదే



కానీ గత కొంతకాలంగా 1/3 చార్జీలు అంటూనే దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఎలాంటి వేతన సౌకర్యం లేని జర్నలిస్టులకు మోయలేని భారమవుతుందని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులకు ఈచార్జీలు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తినే నమ్ముకొని సమాజ అభివృద్ధి కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులు స్థానికంగా ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ కొద్దిమందిగా ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు నాగార్జున, షబ్బీర్, చందు, నాగరాజు, రాజులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం

**ఆమనగల్లు, జూలై 13(సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నూలి పురుగుల నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గీత ఆచారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండ జోల్ టాబ్లెట్లను వేయించారు. ఒక సంవత్సరం నుండి 18 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరూ నులి పురుగుల నివారణకు బాధ్యతగా కృషి చేయాలని చైర్మన్ పత్య నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, హాస్టల్ వార్డెన్ గోపాల్, కౌన్సిలర్ మహేష్, మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# జిమ్‌కు వెళ్లలేకపోతున్నారా?

ప్రస్తుత కాలంలో బిజీ జీవనశైలి కారణంగా చాలామందికి జిమ్‌కు వెళ్లడం లేదా ప్రత్యేకంగా వ్యాయామం చేయడానికి సమయం దొరకడం లేదు. అయితే ఆరోగ్యంగా ఉండాలంటే గంటల తరబడి వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. రోజువారీ జీవితంలో చేసే చిన్నపాటి శారీరక కార్యకలాపాలు కూడా శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాంటి సులభమైన, ప్రభావవంతమైన వ్యాయామాల్లో మెట్లు ఎక్కడం ఒకటి. ఎలాంటి ప్రత్యేక పరికరాలు లేకుండా ఎక్కడైనా చేయగలిగే ఈ వ్యాయామం శరీరాన్ని చురుకుగా ఉంచడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### గుండె ఆరోగ్యానికి మేలు

మెట్లు ఎక్కడం ఒక మంచి కార్డియో వ్యాయామంగా పనిచేస్తుంది. ఇది గుండె వేగాన్ని పెంచి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం వల్ల గుండె పనితీరు మెరుగై గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. మెట్లు ఎక్కే సమయంలో తొడలు, మోకాళ్ల చుట్టూ ఉన్న కండరాలు, తుంటి భాగం, పిరుదుల కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. దీంతో కండరాల బలం, ఓర్పు పెరిగి శరీర సమతుల్యత కూడా మెరుగుపడుతుంది.

### కేలరీలు వేగంగా ఖర్చవుతాయి

సాధారణంగా నడకతో పోలిస్తే మెట్లు ఎక్కడం ద్వారా ఎక్కువ శక్తి వినియోగించబడుతుంది. దీంతో అధిక కేలరీలు ఖర్చై బరువు నియంత్రణలో ఉండటానికి సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి వ్యాయామంగా భావిస్తారు. రోజూ మెట్లు ఎక్కడం వల్ల గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడి శరీరానికి ఎక్కువ స్టామినా వస్తుంది. దీనివల్ల రోజువారీ పనులను అలసట లేకుండా చేయగలుగుతారు.

### ఎముకల ఆరోగ్యం

మెట్లు ఎక్కడం బరువు మోసే వ్యాయామం (ఔవఅస్త్రవ్స్ట్- దీమ్ఘతీఅఅస్త్ర జుఈవతీఎఅంవ) కాబట్టి ఎముకల సాంద్రతను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలంలో ఎముకల బలాన్ని పెంచడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. మోకాళ్ల నొప్పులు, కీళ్లవాతం, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు, తరచూ తల తిరిగే సమస్య ఉన్నవారు లేదా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నవారు వైద్యుల సలహా తీసుకున్న తర్వాత మాత్రమే మెట్లు ఎక్కే వ్యాయామం చేయాలి. వృద్ధులు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

### మెట్లు ఎక్కేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు

వ్యాయామాన్ని మొదట నెమ్మదిగా ప్రారంభించి క్రమంగా వేగాన్ని పెంచాలి. జారిపోని మంచి పట్టు ఉన్న బూట్లు ధరించడం మంచిది. అవసరమైతే మెట్ల రెయిలింగ్‌ను పట్టుకుని ఎక్కాలి. వ్యాయామం చేస్తున్న సమయంలో ఛాతీ నొప్పి, తీవ్రమైన ఆయాసం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆపి వైద్యుడిని సంప్రదించాలి. సరైన విధంగా, క్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శరీర ఫిట్‌నెస్, కండరాల బలం, బరువు నియంత్రణ వంటి అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

అతివ
Athiva
మంగళవారం
14-7-2026

స్టాక్ మార్కెట్
Stock Market

## ఈ20 పెట్రోల్‌తో మైలేజీ తగ్గేమాట వాస్తవమే కానీ: కేంద్రం

**దిల్లీ:** 20 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల కొన్ని వాహనాలలో మైలేజీ తగ్గే మాట వాస్తవమే అని కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ అంగీకరించింది. అదే సమయంలో అధిక ఆక్టేన్ రేటింగ్, అధిక పికప్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి ప్రయోజనాలను విస్మరించకూడదని పేర్కొంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ ప్రోగ్రామ్‌పై విమర్శలు వస్తున్న వేళ చమురు మంత్రిత్వ శాఖ 'సందేహాలు – సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది.




**తొందరపాటు కాదు**
ఈ20 పెట్రోల్ వినియోగాన్ని ఆగమేఘాల మీద అమల్లోకి తెచ్చారన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం పేర్కొంది. 2001లో పైలట్ ప్రాజెక్ట్ లాంచ్ అవ్వగా.. 2006 నాటికి దేశంలోని పలు చోట్ల 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని తెలిపింది. 2022 నాటికి 10 శాతానికి, 2025-26 నాటికి 20 శాతం బ్లెండింగ్‌ను దశలవారీగా సాధించగలిగామని తెలిపింది.

**పాత వాహనాలు పాడవుతాయా?**
పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపై స్పందిస్తూ.. దేశవ్యాప్త వినియోగానికి ముందు ఈ20 వాహనం ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, ఉద్గారాలకు సంబంధించి విస్తృతమైన పరీక్షలకు నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రియల్ వరల్డ్ కండీషన్‌లో ఈ20 వల్ల తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం వంటివేవీ సర్వీస్ చేసిన వాహనాల్లో నిరూపితం కాలేదని పేర్కొంది. మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ కంపెనీల అభిప్రాయాలనూ ఉటంకించింది.

**వేర్వేరు సాధ్యం కాదు..**
పెట్రోల్ రకాన్ని వినియోగదారులు ఎంచుకునేలా ప్యూర్, ఈ10, ఈ20 ఇంధన ఆప్షన్లు ఇవ్వాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని తెలిపింది. దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని వివరించింది.

**ధర ప్రస్తావన**
ఈ20 పెట్రోల్ ధర గురించి స్పందిస్తూ.. రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది. ఒకవేళ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ20 పెట్రోల్ ధరనే.. సాధారణ పెట్రోల్ ధర కంటే కాస్త ఎక్కువగా ఉంటుందని తెలిపింది. కాబట్టి సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని పేర్కొంది.

**రూ. 1.97 లక్షల కోట్లు ఆదా**
ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల రూ. 1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలతో వివరించే ప్రయత్నం చేసింది. 2014-15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ. 1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని పేర్కొంది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## భారీ లాభాలతో ముగిసిన సూచీలు..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. దీంతో బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే దాదాపు రూ. 6 లక్షల కోట్లు పెరిగి రూ. 482 లక్షల కోట్లకు చేరింది.





సెన్సెక్స్ ఉదయం 77,395.63 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,741.82) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,642.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 827.57 పాయింట్ల లాభంతో 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 244.10 పాయింట్ల లాభంతో 24,206.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.31గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, టెక్ మహీంద్రా, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.17 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్సు 4,108 డాలర్ల వద్ద కొనసాగుతోంది. షాంఘై మినహా ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లూ లాభాల్లో ట్రేడింగ్‌ను ఆరంభించాయి.

## ఆల్కహాల్ కలిసిన మందులకూ చీటీ తప్పనిసరి

**దిల్లీ:** ఆల్కహాల్ కలిగిన ఔషధాల విక్రయానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టంచేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ ఎ1 పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.



కొన్ని రకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు రాష్ట్రాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (ఋాదీ), డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ (ఐజజ) సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. దీనివల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి.

## జెరోదా vs గ్రో.. నితిన్ కామత్ పోస్ట్‌తో 'ఎక్స్' వార్

ఆన్‌లైన్ పెట్టుబడి సంస్థల్లో ట్రేడింగ్ ఛార్జీల విధానాల విషయంలో.. దేశంలోని రెండు ప్రధాన బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్‌ల మధ్య బహిరంగ వాగ్వాదం నెలకొంది. ఈ అంశంపై జెరోదా సీఈఓ నితిన్ కామత్ 'ఎక్స్'లో స్పందిస్తూ.. 'గ్రో'పై పరోక్ష విమర్శలు గుప్పించారు. దీంతో 'గ్రో కూడా దీటుగా బదులిచ్చింది. ఇంతకీ వివాదం ఏంటంటే..? మ్యూచువల్ ఫండ్స్ ట్రేడింగ్ విధానాలపై నితిన్ కామత్ స్పందిస్తూ.. "2010లో మేం డిస్కౌంట్ బ్రోకరేజీని ప్రారంభించినప్పుడే.. ఇన్వెస్టర్ల పెట్టుబడి మొత్తం చిన్నదా.. పెద్దదా అనే సంబంధం లేకుండా స్థిరమైన ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాం. ఒక లావాదేవీని పూర్తి చేయడానికి మేం చేసే పని ఒకేలా ఉన్నప్పుడు.. కస్టమర్లు ఎందుకు విభిన్న రుసుములు చెల్లించాలనేదే మా ఉద్దేశం. కస్టమర్లు పెద్దమొత్తాల్లో పెట్టుబడి పెట్టినంత మాత్రాన.. ట్రేడింగ్ విధానంలో ఎలాంటి అదనపు శ్రమ ఉండదు. ఇదే లాజిక్‌ను మేం మ్యూచువల్ ఫండ్స్‌కు కూడా అమలు చేస్తున్నాం. అందుకోసమే ప్రత్యేకంగా కాయిన్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. లావాదేవీలపై పర్సంటేజీ విధానంతో ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు దాన్ని డిస్కౌంట్ బ్రోకరేజీ అని అనరు. ఇక, మాతో పాటే మ్యూచువల్ ఫండ్ ప్లాట్‌ఫామ్స్‌ను ప్రారంభించిన కంపెనీలు ఇప్పుడు కన్పించకుండా పోయాయి. లేదా కొత్త రంగాన్ని ఎంచుకున్నాయి. ఇంకొన్ని కంపెనీలు




కస్టమర్లను ఆకట్టుకునేందుకు కొత్త కొత్త ఆఫర్లు ప్రకటిస్తున్నాయి" అని నితిన్ కామత్ రాసుకొచ్చారు. ఇందులో ఎక్కడా ఆయన 'గ్రో' పేరును నేరుగా ప్రస్తావించలేదు. అయితే, ఇటీవల ఈ కంపెనీ మ్యూచువల్ ఫండ్స్ కోసం 'ప్రైమ్' సేవలను తీసుకురావడంతో నితిన్ కామత్ దాన్నుద్దేశించే పోస్ట్ చేశారని నెటిజన్లు చర్చించుకున్నారు. ఈ క్రమంలోనే 'గ్రో' స్పందిస్తూ కామత్‌కు కౌంటర్ ఇచ్చింది. "మా ఆఫర్లపై తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. 'ప్రైమ్' అనేది ఇన్వెస్టర్ల కోసం మా కంపెనీ తీసుకొచ్చిన అధునాతన ఫీచర్ మాత్రమే. ఏవి కొనాలి, ఏవి అమ్మాలి అనే దానిపై ఇన్వెస్టర్లకు గైడెన్స్ ఇచ్చే వేదిక. అంతేగానీ, మా ప్లాట్‌ఫామ్‌లో ఎలాంటి మార్పుల్లేవు. ప్లాన్లు, ఛార్జీలు అన్నీ గతంలో ఉన్నవే. కొందరు ఇన్వెస్టర్లు సొంతంగా ట్రేడింగ్ చేసుకోగలరు. మరికొందరికి గైడెన్స్ అవసరం. వారందరికీ సేవలందించేందుకే కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చాం" అని గ్రో వివరణ ఇచ్చింది.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**
**సైదాబాద్‌లో సీసీ కెమెరాల ప్రారంభం**





జమ్మికుంట, (సింగిడి):: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణ అదుపులో ఉంటుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గురువారం జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో గ్రామ పాలకవర్గం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను ఆయన హుజూరాబాద్ ఏసిపి వనపర్తి మాధవి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, సైదాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం 11 నిఘా నేత్రాల ను గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. సైదాబాద్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు పంచాయతీ పాలకవర్గాలు దాతల సహకారంతో నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణ అదుపులో ఉంటుందని నేరం జరిగితే నిఘా నేత్రాల ద్వారా నిందితులను గుర్తించ వచ్చునని పేర్కొన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గంజాయి లాంటి నిషేధి మాదక ద్రవ్యాలను ఎవరైనా వినియోగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎవరైనా అనుమానితులు గ్రామములో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

**పంచాయతీ పాలక వర్గాన్ని అభినందించిన సీపీ**

సుమారు ఒక లక్ష 50 వేల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో 11 నిఘా నేత్రాలను ఏర్పాటు చేసి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్న సైదాబాద్ గ్రామ సర్పంచ్ పుప్పాల రాజారాం తోపాటు ఉప సర్పంచ్ వారి పాలకవర్గాన్ని పోలీస్ కమిషనర్ అభినందించారు. అనంతరం గ్రామ సర్పంచ్ రాజారాం మాట్లాడుతూ, హుజూరాబాద్ ఏసిపి జమ్మికుంట పట్టణ సిఐ ఇలా అశోక్ ల సూచనల మేరకు గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామస్తుల సహకారంతో ఈ మహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని గ్రామానికి చెందిన కొప్పుల ప్రవీణ్ ఎన్నారై 40 వేల రూపాయల విలువచేసే టీవీని గ్రామపంచాయతీకి బహూకరించడం జరిగిందని వారికి గ్రామపంచాయతీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసిపి మాధవి జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోరపల్లిలో ప్రీ-ప్రైమరీ పాఠశాల
# ప్రారంభించిన సిపి గౌస్ ఆలం



జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో 2026--2027 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీ-ప్రైమరీ పాఠశాలను గురువారం కరీంనగర్ పోలీస్ ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల బృందం కరీంనగర్ సిపి గౌస్ ఆలం హుజూరాబాద్ ఏసిపి మాధవి మండల విద్యాధికారి మంతెన హేమలత లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికగా మొక్కలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బలమైన పునాది ప్రీ ప్రైమరీ విద్య అని పిల్లలను క్రమం తప్పకుండా ప్రైమరీ స్కూలుకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తుందని ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధుసూదన్ ఉపసర్పంచ్ రాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దబ్బెట రవీందర్ సీనియర్ ఉపాధ్యాయులు గుడిమిల బలరాం సంగసాని కుమారి ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు శైలజ సి ఆర్ పి గర్రెప్పు వీర రేఖ వార్డు సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా బంగారు పెద్దమ్మ ఆలయంలో వార్షికోత్సవం
**పంచామృతాభిషేకం కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు**



మెట్‌పల్లి, (సింగిడి): పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో 16వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనం తరం ఆలయ ప్రాంగణంలో హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో నిర్వహణ**

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో కీలకమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కం బాబు, యామా గణేష్, లోకల సురేష్, తోకల గంగ నరసయ్య, తోకల వెంకటేష్, జట్ట వేణి రమేష్, మారంపల్లి సాయిలు, జక్కం శేఖర్, శివ ధర్మయ్య, నరసయ్య, భూమయ్య, డాక్టర్ ఆనంద్ బాబు దంపతులు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసిన
# టీఎన్‌జీవోల ప్రతినిధులు

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని**
**డీఈఓ ప్రశాంత్ రెడ్డి హామీ**



కరీంనగర్, (సింగిడి):: జిల్లా విద్యాశాఖ అధికారి నరెడ్ల ప్రశాంత్ రెడ్డిని టీఎన్‌జీ వోల సంఘం ప్రతిని ధులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిసి ఉద్యోగులు ఎదుర్కొం టున్న వివిధ సమస్యలను వివరిం చారు. ఈ సంద ర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం టీఎన్‌జీవోల సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీఆర్‌టీ యూ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, టీఎన్‌జీవోల కేంద్ర సంఘం నాయకులు, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, పట్టణ కార్యదర్శి వెలిచాల సుమంత్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తోట రామస్వామి, జిల్లా కార్యదర్శి శంకర్, పట్టణ అధ్యక్షులు మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ఎన్‌సీసీపై పాఠశాలల
# నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం

**విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడమే**
**ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యం: కమాండింగ్ అధికారి కల్నల్ జయంత్**



కరీంనగర్, (సింగిడి):: కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో సీబీఎస్ఈ పాఠశాలలో 9వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు మరియు అనుబంధ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ జయంత్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. దేశానికి సేవ చేయడం ప్రతి పౌరుడి ప్రధాన కర్తవ్యమని, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఎన్‌సీసీ శిక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎన్‌సీసీ కార్యకలాపాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా దేశ రక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు, నాయకత్వ నైపుణ్యాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 2026,27 విద్యా సంవత్సరంలో చేపట్టనున్న ఎన్‌సీసీ కార్యక్రమాలు, వాటి అమలు విధానం, అవసరమైన వనరులు, పాఠశాలల సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అనుబంధ అధికారులు పాల్గొన్నారు.

## వారాహీ అమ్మవారి ఆలయ నిర్మించడం అభినందనీయం
**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):: వారాహీ అమ్మవారి కృపాకటాక్షాలు నగర వాసులపై ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆకాంక్షించారు. నగరంలోని అమ్మా నగర్ లో నిర్మిస్తున్న ఆలయ పనులను గురువారం ఎమ్మెల్యే ధన్ పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తొలి వారాహి అమ్మవారి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కృష్ణశిలతో ఆలయాన్ని నిర్మించటం సంతోషకరమన్నారు. ఇందూరులో ఆధ్యాత్మిక చింతన పెరిగిందని, హిందువుల ఐక్యతకు ఆలయాలు దోహదపడతాయన్నారు. యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిత్య ఆలయ దర్శనం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఇకపై జరిగే వారాహీ అమ్మవారి పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మంచాల జ్ఞానేందర్, ఎల్ వీ ఆర్ అధినేత శివ ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారమిత హెరిటేజ్ పాఠశాలలో నమూనా ఎన్నికలు నిర్వహణ

**ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాల పెంపుదలకు వినూత్న కార్యక్రమం.**
**పారమిత విద్యాసంస్థల అధినేత డా ఇ. ప్రసాద్‌రావు**



కరీంనగర్, (సింగిడి):: స్థానిక కొత్తపల్లి మండలం పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠ శాలలో విద్యార్థి మంత్రి మండలి ఎన్నికలను నమూ నా పద్ధతిలో నిర్వహించారు. ప్రధాన విద్యార్థి, ప్రధా న విద్యార్థిని, క్రీడలు, క్రమ శిక్షణ, సాంస్కృతిక విభాగాల నాయకులు, ఉపనాయకులను ఈ-బ్యాలెట్ విధా నంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించి ఎన్నుకు న్నారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులే పోలింగ్ సిబ్బంది, ఎన్నికల అధికారులు, ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించడం విశేషం. విద్యార్థులు ఉత్సాహంగా ఓటు వేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత డా. ఇ. ప్రసాద్‌రావు మాట్లాడుతూ, ఓటు విలువను విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులని, భవిష్యత్తులో రాష్ట్ర, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే నాయకులుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, ప్రజాస్వామ్య విలువలను పెంపొం దించేందుకు ఈ ఎన్నికలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.ఎం. ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యా యులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవాని, నిఖిల, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**కోరపల్లి, సైదాబాద్‌లలో సీసీ కెమెరాల ప్రారంభం**
**యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి..**
**విద్యార్థులతో సిపి గౌస్ ఆలం మాటామంతి**



జమ్మికుంట, (సింగిడి):: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని కరీంనగర్ సిపి గౌస్ ఆలాం అన్నారు. కరీంన గర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కోరపల్లి, సైదాబాద్ గ్రామాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమె రాలను సిపి ప్రారంభించారు. అదేవిధంగా కోర పల్లి గ్రామంలో గల ఎంపీపీ ఎస్ లో ప్రీ ప్రైమరీ పాఠశాలను సిపి ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో ప్రతి వారం జరిగే స్నేహిత కార్యక్రమంలో భాగంగా సమస్యలు ఉన్నట్లయితే నేరుగా పోలీసు అధికా రులకు తెలియజేయడం కానీ లేదా కంప్లైంట్ బాక్స్ లో చిట్టి రాసి వేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకునే విద్యార్థులు మట్టిలోని మాణిక్యాలని దేశ భవిష్యత్తు వారి చేతు ల్లోనే ఉందని ఉపాధ్యాయులు బోధించే పాఠాలను బాగుగా విని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం జమ్మికుంట కాలేజ్ గ్రౌండ్ లో వాలీబాల్ పోటీలలో గెలుపొందిన యువతకు బహుమతులను అందజేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో సిపి గౌస్ ఆలం పాల్గొని యువతకు మార్గదర్శకం చేశారు. ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడం వల్ల వారి జీవితా లను కోల్పోవడమే కాకుండా తల్లిదండ్రులకు సైతం భారంగా తయారవుతున్నారని అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

మత్తు పదార్థాల విక్రయా లు కనుక కొనసాగించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, మత్తు పదార్థాలు విక్ర యించే వారి సమాచారాన్ని పోలీస్ శాఖకు అందిం చాలని కోరారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో గ్రామ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కరీంనగర్ జిల్లాలో 700 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రణాళికలో ఉన్నామని ప్రతి గ్రామంలోని పాలకవర్గం సభ్యులు ముందుకు వచ్చి గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవా లన్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసు లతోని సమానమని నేర పరిశోధన సమయంలో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో హుజురాబాద్ ఏసిపి మాధవి, సిఐలు రామకృష్ణ గౌడ్ పులి వెంకట్, ఎస్సైలు రాజేష్ రమేష్ సంజయ్ మండల విద్యాధికారి హేమలత, సర్పంచులు మధుసూదన్, రాజారాం, ప్రధానోపాధ్యాయుడు దెబ్బెట రవీందర్, బలరాం, కుమారి శైలజ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ విజయవంతానికి పార్టీల సహకారం అవసరం
## నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్, (సింగిడి):: కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, గణనాధికారులు దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, ఓటరు దరఖాస్తుల పూరణ తదితర అంశాలపై ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. నగర పరిధిలో పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని, ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల రెవెన్యూ అధికారులు (ఎంఆర్‌ఓలు) పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలి
## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, (సింగిడి):: జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, వానా కాలం సాగు, తదుపరి కార్యాచరణ పై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ జిల్లా వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతు వేదికల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఆరుతడి పంటలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో బావులు, బోరుబావుల ఆధారంగా సాగు విస్తృతంగా జరుగుతున్నం దున తక్కువ నీటితో పండే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. యూరియా విక్రయాలు ఆన్‌లైన్ విధానంలో కొనసా గుతున్నందున ఎరువుల కొరత ఉండదని, పంపి ణీని అధికారులు నిరంతరం పర్యవేక్షిం చాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేస్తే బోనస్ లభిస్తుం దని, ఈ విషయాన్ని ప్రతి రైతుకు తెలియజేయాలని అన్నారు. రైతు వేదికలను సమర్థంగా వినియోగిం చుకొని స్థానిక ప్రజాప్రతి నిధుల సహకారంతో రైతులకు వానాకాలం సాగుకు సంబంధించిన సూచనలు అందించాలని సూచించారు. నీటి లభ్యత, విడుదలపై నీటిపా రుదల శాఖ అధికా రులు ప్రణాళికాబద్ధంగా వ్యవ హరించాలని, వ్యవసాయ--నీటిపారుదల శాఖలు సమన్వ యంతో పనిచేయాలని పేర్కొ న్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం, పంటల ఎంపికపై మార్గ దర్శకాలు నిరంతరం అందించాలని, మండలాల వారీగా పరిస్థితిని సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. రైతులు అధికారుల సూచనలను పాటించి వదంతులను నమ్మవద్దని సూచిస్తూ, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంద న్నారు. అలాగే, వీబీజీరామ్‌జీ పథకం అమలుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి గ్రామీణ కూలీలకు వీలైనంత ఎక్కువ పని దినాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# గాంధీనగర్‌లో పోచమ్మ-బొడ్రాయి అమ్మవార్లకి ప్రత్యేకపూజలు
**పునఃప్రతిష్ఠ అనంతరం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు**




హుస్నాబాద్ (సింగిడి):; హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలో పోచమ్మ--బొడ్రాయి గ్రామదేవతల పునఃప్రతిష్ఠ మహోత్సవం అనంతరం నిర్వహించే సంప్రదాయ తిరుగు వారం కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవార్లకు అభిషేకం, విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలు సంపత్ దంపతులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, గాంధీనగర్ గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని, రైతులకు మంచి పంటలు పండేలా సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్, వార్డు మెంబర్ చెంచు సంపత్ మాజీ ఎంపీటీసీలు మేదిని వెంకటస్వామి, జనగామ రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. పునఃప్రతిష్ఠ అనంతరం సంప్రదాయంగా నిర్వహించే తిరుగువారం పూజలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగాయి.

## జమ్మికుంటలో సినీ నటుడు
# సుమంత్ ప్రభాస్ సందడి..



జమ్మికుంట (సింగిడి): :జమ్మికుంట పట్టణంలో జరిగిన పలు వివాహ వేడుకలకు విచ్చేసిన గోదావరి సినిమా హీరో సుమంత్ ప్రభాస్ సందడి చేశారు. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ ను కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ ఆత్మీయంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి, ఆత్మీయ స్వాగతం పలికారు. సినీ రంగంలో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఆత్మీయ కలయిక వివాహ వేడుకకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ నటుడు సుమంత్ ప్రభాస్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు.

## చలో హుస్నాబాద్ గౌడ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలి
**బుర్ర శ్రీనివాస్ గౌడ్**



హుస్నాబాద్ (సింగిడి):): అక్కన్నపేట గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం హుస్నాబాద్‌లోని బీఎంకే (బి ఎం కె) ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న "చలో హుస్నాబాద్ -- గౌడ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర గౌడ సంఘం (మోకు దెబ్బ) వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అక్కన్నపేట మండలంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గౌడల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ఈ సభ అత్యంత కీలకమని పేర్కొన్నారు. అక్కన్నపేట మండలానికి చెందిన గౌడ సోదరులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మీడియా సమావేశంలో తాళ్లపల్లి మల్లేశం గౌడ్, జాగిరి మల్లేశం, బత్తిని రాజు, కోయడ రాజు, బత్తిని శ్రీనివాస్, మంద సదయ్య తదితరులు పాల్గొని, గౌడ సమాజం ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సభకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వర్షపు నీటి కాలువపై
# స్లాబ్ నిర్మాణానికి చర్యలు

**అంచనాలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని అధికారులకు డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఆదేశం**



కరీంనగర్, (సింగిడి):: నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న బహిరంగ వర్షపు నీటి కాలువను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నివాసాల మధ్యగా ఉన్న ఈ బహిరంగ కాలువ కారణంగా ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. సుమారు 22 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కాలువ నగరంలోని వరద నీటిలో గణనీయమైన భాగాన్ని తరలిస్తూ, పరిసర ప్రాంతాలను ముంపు నుంచి రక్షిస్తోందన్నారు. ప్రస్తుతం కాలువ పలు చోట్ల దెబ్బతిని శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు, గతంలో ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా దెబ్బతిన్న ప్రాంతాలను పునర్నిర్మించి, అవసరమైన చోట రక్షణ గోడలు నిర్మించడంతో పాటు మొత్తం కాలువపై స్లాబ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో దుర్వాసన తగ్గడంతో పాటు ప్రమాదాలు నివారించబడతా యని, వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు చేపడతామని చెప్పారు. ఈ పనులకు సంబంధించిన అంచనాలను వెంటనే సిద్ధం చేసి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశిం చారు. రాబోయే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసి ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో మున్సిపల్ అధికారులు గట్టు స్వామి, ఖాలిద్, కాలనీవాసులు ఆంజనేయులు, వామన్‌రావు, శంకరయ్య, సత్యం, సురేందర్, లక్ష్మణమూర్తి, నారాయణ గౌడ్, కనకయ్యతో పాటు పలువురు మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

### కాంగ్రెస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి
### మాధవ నగర్ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగితే సమాజంలో శాంతి, సామరస్యం నెలకొంటాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే ఆలయాల అభివృద్ధి సాధ్యమవుతోందని,రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూప తి రెడ్డి అన్నారు. మాధవ నగర్ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్ట హాసంగా జరుపుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను వేద పండితులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. డిచ్‌పల్లి మం డలం బర్ది పూర్ శివారు మాధవ్‌న గర్ సాయి బా బా ఆలయంలో గురువారం నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో నగర మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలక మండలి సభ్యులతో ముఖ్య అతిథులు ప్ర మాణ స్వీకారం చేయిం చారు. అనంతరం ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ నూత న చైర్మన్ చలసాని మీనా-శ్రీనివాస్ లతో పాటు నూ తన కార్యవర్గ సభ్యులకు రూరల్ ఎమ్మెల్యే నియామక పత్రాలు అంద జేశారు. సాయి బాబా ఆలయ నూతన పాలకవర్గం భక్తులకు మెరుగైన సేవలు అంది స్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచిం చారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం టెంపుల్ టూరి జం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని,ఆధ్యాత్మిక క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ అభివృద్ధికి రూ. 3 కోట్లతో ప్రతిపా దనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ చలసాని మీనా శ్రీనివాస్, డైరెక్టర్లు, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మ న్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

### విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు
### విశ్రాంత ఉపాధ్యాయులు తమ సహకారాన్ని అందించాలి.
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.



**గద్వాల బ్యూరో (సింగిడి)::** ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాల యంలోని కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది, ప్రస్తుతం విద్యార్థుల ఎన్రోల్మెంట్ ఆఫ్లైన్, ఆన్లైన్ నివేదికలను అందజేయాల్సిందిగా ఆదేశిం చారు. ఎన్రోల్మెంట్ పెంచే టాప్ ముగ్గురు డిఈఓలకు ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో పతకాలను, ఎంఈఓలకు జిల్లా స్థాయిలో ప్రోత్సాహకాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణ యించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభు త్వ పాఠశాలల్లో చేరేందుకు వస్తున్న విద్యార్థులకు ప్రైవేటు యాజమాన్యాలు బోనఫైడ్, టీసీలు ఇవ్వ కుండా ఇబ్బంది పెడితే సహించేది లేదని తగు చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. అపార్ నమో దు పెరగాలని, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు రెన్యు వల్, కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సహ కరించాలన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో అంగ న్వాడి కేంద్రాల చిన్నారులు పెద్ద సంఖ్యలో చేరేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం రుచికరంగా వండించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు విశ్రాంత ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు రావచ్చని, ఈ ఏడాది విద్యార్థుల ప్రవే శాలు పెరిగిన పాఠశాలలకు విద్యా వాలంటీర్లను నియమిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డీఈవో విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, సెక్టోరియల్ అధికా రులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

### ఎంపీ వద్దిరాజును సత్కరించిన
## మున్నూరు కాపు సంఘ నాయకులు



**ఖమ్మం, (సింగిడి):** రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేతగా, పార్లమెంటరీ పార్టీ లీడర్ గా నియమితులైన వద్దిరాజు రవిచంద్రను పలువురు మున్నూరుకాపు ప్రముఖులు కలిసి శాలువాలతో సత్కరించి, యువసేన సభ్యులు ఆయన చేత కేక్ కట్ చేయించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం బురహాన్ పురంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ప్రముఖులు పారేపల్లి రవికుమార్, దుగ్గినేని వెంకటేశ్వర్లు, [illegible] రాజా, వాకాటి రమేష్, జి.వి.వి.ఎల్. నర్సింహారావు, గోకుల్, హరికాశనాయుడు, ప్రముఖ జర్నలిస్ట్ కాపు జేడీసీ ఛైర్మన్ చంద్ర జనార్దన్, మున్నూరుకాపు సంఘం యువజన విభాగం ఖమ్మం జిల్లా అధ్యక్షులు తోట రమేష్ తదితరులు రవిచంద్రను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. అలాగే, వద్దిరాజు యువసేన నాయకులు సంకర చిరంజీవి, నాసరాల హరీష్, ఆకుల సురేష్, ఆకుల వినయ్, వారాల గణేష్, తుపాకుల సాయి, మహ్మద్ షాహిద్ (షారు), విజేత, సాంబశివరావు, అబ్దుల్ రెహమాన్, అన్వేష్, నవీన్, మహ్మద్ షారుఖ్, చేముల విజయ్, ధనుంజయ్ తదితరులు ఎంపీ రవిచంద్ర చేత కేక్ కట్ చేయించి హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.

### ఓటు హక్కు మనబలం... నమోదు మనబాధ్యత
### గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి



**భిక్నూర్, (సింగిడి):** ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఓటరు వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను భర్తీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి బలం అని, ప్రతి కుటుంబం అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల సూపర్‌వైజర్ పరమాత్మ గౌడ్, జి.పి.ఓ. సంతోష్, బి.ఎల్.ఓ. లక్ష్మి పాల్గొన్నారు.

### ఎస్.ఐ.ఆర్. పై అవగాహన కల్పించిన
## మోర్తాడ్ మండల తహసీల్దార్



**ఆర్మూర్, (సింగిడి):** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఎస్. ఐ.ఆర్. సర్వే ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా మోర్తాడ్ మండల తహసీల్దార్ విలువ కృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని మోర్తాడ్ గ్రామంలోని పద్మశాలి కళ్యాణ మండప భవనంలో బిఎల్ఓ లతో పాటు ప్రజలకు మరింత ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలు కల్పించారు. అంతేకాకుండా మండలంలోని దోన్ పాడ్, వడ్యాట్, గ్రామాలలోనూ స్థానిక సర్పంచ్ సహకారంతో బీఎల్వోలు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎస్ ఐ ఆర్ పట్ల అవగాహన లేని ప్రజలను, రాయరాని వారిని దృష్టిలో పెట్టుకొని మరింత సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ఎస్. ఐ. ఆర్. సర్వే ప్రతి ఒక్కరికి సులభంగా అందేందుకు, సకాలంలో పూర్తయ్యేలా మోర్తాడ్ మండల తహసీల్దార్ ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఇట్టి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మండల తాసిల్దార్ విలువ కృష్ణ కోరారు. సహకరించిన ఆయా గ్రామాల సర్పంచులకు, అధికార పార్టీ నాయకులకు తాసిల్దార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### శుభ్రమైన చేతులు.. సురక్షితమైన ఆరోగ్యం
### మండల వైద్యాధికారి యేమిమా

**భిక్నూర్, (సింగిడి):** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ హేమిమా సూచించారు. గురువారం భిక్నూర్ లోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఆమె తెలిపారు. చేతుల పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులు, కడుపు సంబంధిత సమస్యలను నివారించవచ్చని వివరించారు. అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పవన్ కుమార్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలుగుతారు.

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు



**ఖమ్మం, (సింగిడి):** బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే విద్యాభ్యాసంలో రాణించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలరని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు అన్నారు. గురువా రం ఖమ్మం పట్టణంలోని న్యూ బస్టాండ్ సమీపంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ అవ గాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్య క్రమంలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాల్గొని ఆల్బెండజోల్ మాత్రను నమిలి మింగాలని సూచిం చారు. భోజనం అనంతరం మాత్రను తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు ఏర్పడతాయని, ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను నివారించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని వివరించారు.
అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ భోజనం చేసే ముందు, మలవిసర్జన అనంతరం తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కో వాలని, గోళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశు భ్రమైన తాగునీటిని వినియోగించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విద్యార్థినులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రతి మనిషి సేవా మార్గంలో నడవాలి

### జిల్లా కాంగ్రెస్ మెడికల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ
### ఘనంగా లయన్ ఉండ్రు శ్యాంబాబు పుట్టినరోజు వేడుకలు
### తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, విద్యార్థులకు స్టడీ కిట్లు, నిరుపేద మహిళలకు చీరల పంపిణీ
### 20వ వార్డులో ఉచిత వైద్య శిబిరం





**వైరా, (సింగిడి):** వైరాలో లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు, జిల్లా జిఈటి కోఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు పుట్టినరోజు వేడుకలు లయన్స్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో ముగ్గురికి తోపు డు బండ్లు, మహిళ లకు రెండు ఉచిత కుట్టు మిషన్లు, 20వార్డు లో ఉచిత వైద్య శిబిరం, విద్యార్థుల కు స్టడీ మెటీరియల్, నిరుపేద మహిళల కు చీరల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ మెడికల్ సెల్ అధ్యక్షులు లయన్ డాక్టర్ కాపా మురళి కృష్ణ విచ్చేసి మాట్లాడుతూ శ్యామ్ బాబు కృషి, పట్టుదలతో ఎది గారని, సమాజానికి సేవ చేయాలి అనే లక్ష్యంతో గత 16 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ లో సేవలంది స్తున్నారని తెలిపారు. ప్రతి మనిషి సేవా మార్గంలో నడిచి సమాజంలో సేవా కార్యక్రమాలలో నిరంతరం భాగస్వాములు కావాలని, తమకున్న మార్గాల ద్వారా నిరుపేదలను ఆదుకోవడం కర్తవ్యంగా భావించాలని కోరారు. శ్యాం బాబు పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల శ్యాంబాబు, వరలక్ష్మి దంపతులను అభినందించారు. అనంతరం శ్యాం బాబు మాట్లాడుతూ అందరి ఆశీస్సులతో, ఆదరాభిమానాలతో తన బాధ్యత మరింత పెరిగిం దన్నారు. అనంతరం మూడు లయన్స్ క్లబ్బులు, 20 వార్డు మిత్రబృందం సభ్యులు కేక్ కటింగ్ చేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేంద్రరావు, జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్, రీజియన్ సెక్రటరీ వై బుచ్చిరామారావు,క్లబ్ మహిళా కోఆర్డినేటర్ 12 వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, 20వవార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి, మూడు లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు కొల్లా రాంబాబు, ఉయ్యూరు రామకృష్ణ, గద్దె నీరజ, సెక్రటరీ కొదు మూరి రవి, జాలమహాలక్ష్మి,సుగ్గల మాధవి, కోశాధి కారి కొదుమూరి భాగ్యలక్ష్మి,జిల్లా కమిటీ సభ్యులు జాల పుల్లారావు, నూకల ప్రసాదరావు,ఏపూరి రాజా రావు, కొమిరిశెట్టి శ్రీధర్, చింతలపూడి వెంకటేశ్వం రావు, చెరుకూరి శ్రీనివాసరావు, పువ్వాళ్ళ రాము, భీక్య, గుమ్మడిదల వెంకట నారాయణ, గంగవరపు కిషన్ రాయ్, లయన్స్ ఐ కేర్ హాస్పిటల్ సిబ్బంది, 20వ వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు,మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్ బియ్యం నిల్వలపై సీసీఎస్ బృందం మెరుపు దాడి

### 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం..... పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడి



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి)::** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై సీసీఎస్ బృందం మెరుపు దాడి చేసి 15 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజామ్ కాలనీలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచడంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు సిసిఎస్ ఏసీపీ శ్రీశైలం పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి. సాయినాథ్, ఎస్ఐ మహేష్, సిబ్బంది మెరుపు దాడి నిర్వహించారు. దళారుల ద్వారా పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి,ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఒక ఇంట్లో నిల్వ ఉంచినట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా సుమారు 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అక్రమంగా బియ్యం నిల్వ చేసిన రెహాన్ ను అదుపు లోకి తీసుకున్నారు. మరో నిందితుడు మోసిన్ పరా రీలో ఉండగా అతనిపై కూడా కేసు నమోదు చేసేం దుకు తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓకు కేసును అప్పగిం చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, తరలించడం లేదా విక్ర యించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని నిజామా బాద్ పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యం

### సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి):** కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రత్యేక కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాచారెడ్డి సబ్ ఇన్‌స్పె క్టర్ అనిల్ కుమార్ సూచనల మేరకు,ఏఎస్ఐ నరేం దర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఈ కార్యక్ర మాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రేమ పేరుతో జరిగే మోసాలు,మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు,మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు,మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలు,మానవ అక్రమ రవాణా నియంత్రణ వంటి సామాజిక అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్ర మత్తంగా ఉండాలని,తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని,ఏ చిన్న పొరపాటు చేసినా జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు చెప్పే మంచి సూచ నలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో డయల్-100,సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930,మహిళల భద్రత కోసం కామారెడ్డి షీ టీమ్ -- 8712686094 నంబర్లను వినియోగించాలని తెలిపారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి,వారి బృందం పాటలు,సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థులను ఆకట్టుకుని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేం దుకు, విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూనే ఉంటారు.

# ఎస్ఏ ఐ ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

### ఎమ్మెల్యే నారాయణ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** ఓటరు జాబితాలోని ప్రతి అర్హుడు ఓటు పరిరక్షించాలని, బిఎల్ఏలు అప్రమ త్తంగా పనిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. టిపిసిసి ఆదేశానుసారం ప్రకారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్లో సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిర్వహిం చడం జరిగింది. ఈసందర్భంగా బిఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చురుకుగా పాల్గొనాలని, ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు సక్రమంగా ఉండేలా కృషిచేయాలని ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ, బిఎల ఓలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ ప్రతి బూత్ లోని ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిం చాలని, అర్హులైన ఏ ఓటరు పేరు కూడా అనవసరంగా తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని ఓటర్ల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృ తంగా తీసుకెళ్లాలని, ప్రజల మద్దతుతో రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రతికార్యకర్త అంకితభావంతో పనిచేయా లని పిలుపునిచ్చారు. ఈసారి దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అయ్యేంతవరకు బిఎల్ఏలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరింత బలంగా పనిచేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, తహసీల్దార్ కార్తీక్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భూపతిరెడ్డి, జిల్ల కార్యదర్శి మోతిలాల్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్లు పత్య నాయక్, బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వెల్దండ ఉప సర్పంచ్ శ్రీనివాస్, బొల్లంపల్లి సర్పంచ్ సత్తారి ప్రసాద్ గౌడ్, బండోనీ పల్లి సర్పంచ్ సంగీత శేఖర్ రెడ్డి, మండల సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్ల య్య, ముక్తాల రమేష్, గన్య నాయక్, శ్రీను నాయక్, సామ వెంకటయ్య, గున్నెళ్ళ శ్రీనివాస్, కేశమల్ల అ-నూష కృష్ణ, తిరుగుడు మంజుల, సూపర్వైజర్లు, కోఆర్డినేటర్లు, ఇన్చార్జిలు, బిఎల్ఏలు, నాయకులు రషీద్, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, గుద్దేటి కిష్టాల్, ముదిగొండ రమేష్, వాణి పురుషోత్తం చారి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా
# సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో గ్రామ ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి తమ ఓటరు వివరా లను సరిచేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. జూలై 9 నుంచి జూలై 24 వరకు దరఖాస్తులను పూర్తిగా నింపి బీఎల్‌వోలకు లేదా గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పిం చవచ్చని చెప్పారు. ఓటరు వివరాల్లో పేరు, చిరునామా, వయస్సు లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ఏర్పాట్లు ఉన్నాయని వివరించారు. బీఎల్‌వోలు అందజేసిన దరఖాస్తు ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి ఈ నెల 24వ తేదీలోపు సమర్పించాలని గ్రామ ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హుడైన ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవాలని సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి కోరారు.

### ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, (సింగిడి):** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా సంబం ధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాల భద్రత, రికార్డుల నిర్వహణ, సీలింగ్ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జేసి విక్టర్ వున్నారు.


## ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్..



**నాగర్ కర్నూల్, (సింగిడి)::** వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను నాగర్ కర్నూల్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో డి. ఎస్. పి బుర్రి శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం. సంవత్సర కాలం వ్యవధిలో నాగర్ కర్నూల్ మండలం వన పట్ల తిమ్మాజీపేట మండలం గోరుట గ్రామాలలో 20.5 తులాల బంగారం 20 తులాల వెండి చోరీకి గురైందని దీంతో నాగర్ కర్నూల్ సీఐ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్ తిమ్మాజీపేట ఎస్సై శ్రీనివాస్ పెద్దకొత్తపల్లి ఎస్సై రమేష్ ఒక కానిస్టేబుల్ తో టీం ఏర్పాటు చేశామని వారు తెలిపారు. సీసీ కెమెరాలు ఇతర పద్ధతిలో విచారణ చేసి ఇద్దరు దొంగలను అరెస్టు చేసి విచారించగా మొ త్తం ముగ్గురు వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నామని చెప్పారని వనపర్తికి చెందిన మూడో వ్యక్తి ప్రధాన దొంగ కోసం గాలిస్తుండగా సెల్ఫోన్ సిగ్నల్స్ ఆధా రంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో పట్టుకొని విచారణ చేపట్టామని విచా రణలో ఏ వన్ అనే వ్యక్తి తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడేవాడని మిగతా ఇద్దరు బయట కపాలగా ఉండేవారని నింది తులపై రాష్ట్రవ్యాప్తంగా 20 25 కేసులు ఉన్నాయని వివరించారు. వారి వద్ద నుండి 19 తులాల బంగారం 20 తులాల వెండి రికవరీ చేశామని నిందితులను కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తిమ్మాజిపేట, బిజినాపల్లి, నాగర్ కర్నూల్ లలో టవర్స్ ఏర్పాటు చేశామని 20 కిలోమీటర్ల వరకు ఈ టవర్ సామర్థ్యం ఉం టుందని ప్రతి ఒక్కరు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొని ఈ టవర్ల కు అనుసం ధానం చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో ప్రధాన కూడళ్లలో సర్పంచులు చొరవ చూపించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి టవర్ కు అనుసంధానం చేయాలని తద్వారా చోరీలు, కిడ్నాప్ లు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు విచారణలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని చోరీలు కూడా నియంత్రణలోకి వస్తాయని తెలిపారు.

### పాఠశాలల్లో టీజీవీపీ సభ్యత్వ నమోదు.

**భిక్నూర్, (సింగిడి):** తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీజీవీపీ లక్ష్యాలు, విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారంలో సంస్థ పాత్రపై అవగా హన కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా టీజీవీపీ ముందుండి అండగా నిలిచి, పరిష్కారం కోసం కృషి చేస్తుందని నాయకులు హామీ ఇచ్చారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ మండల అధ్యక్షుడు దేవుని భరత్, వైస్ ప్రెసిడెంట్ విజయ్, ధనుష్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతవేళ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
14-7-2026

# మాలపల్లిలో అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష..

ఓటరు జాబితా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన





**హుస్నాబాద్, (సింగిడి):** హుస్నాబాద్ మండలంలోని మాలపల్లిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను MPDO సురేష్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో SIR కార్యక్రమం పురోగతిని సమీక్షించి, BLO\T, BLA\T, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. ఓటర్ల ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సిబ్బందిపై ఉన్న ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్న సురేష్, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, నిష్పక్షపాత విధానాన్ని పాటించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించిన ఆయన, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి గ్రామస్తుడి బాధ్యత అని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తదనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, సీసీ రోడ్లు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, ఓపెన్ జిమ్, డంపింగ్ షెడ్‌లను పరిశీలించారు. అలాగే నూతనంగా నిర్మించనున్న NAC సెంటర్ కోసం ప్రతిపాదించిన స్థలాన్ని సందర్శించి సంబంధిత అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు, ఉపసర్పంచ, ఫోరం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాజ్ కుమార్‌గౌడ్, గ్రామ కార్యదర్శి దివ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మామిడి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు రమేష్ నాయక్, హనుమండ్ల శ్రీకాంత్‌రెడ్డి, దీపా సరోజన, BLA వెన్న మల్లికార్జున్, EGS మల్లేష్ వెన్న, బత్తుల రాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సంక్షేమ స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోంది

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



**కరీంనగర్, (సింగిడి):** మాజీ ముఖ్య మంత్రి దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పార్టీ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, వైఎస్సార్ తన రాజకీయ జీవితమంతా ప్రజాసేవకు అంకితం చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని అన్నారు. 2003లో చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరద కాలువల నిర్మాణం, శాతవాహన విశ్వవిద్యాలయం, జేఎన్టీయూ వంటి విద్యాసంస్థల ఏర్పాటులో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. వైఎస్సార్ అకాల మరణం రాష్ట్రానికి తీరని లోటని పేర్కొన్న ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఎస్సార్ సంక్షేమ స్ఫూర్తితో ప్రజా సంక్షేమ పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. వైఎస్సార్ పోరాటస్ఫూర్తిని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, ఎండి తాజ్, మడుపు మోహన్, కర్ర సత్య ప్రసన్న, బానోతు శ్రావణ్ నాయక్, వెన్న రాజమల్లయ్య, సిరాజ్ హుస్సేన్, సురేందర్ రెడ్డి, ముదుగంటి, గంట శ్రీనివాస కళ్యాణి, కాంతాల జగన్ రెడ్డి, వర్ధ పద్మ, గుండటి శ్రీనివాస్ రెడ్డి, వంగల విద్యాసాగర్, దిండిగాల మధు, మాదాసు శ్రీనివాస్, కుంభాల రాజు కుమార్, కల్వల రామ్ చందర్, షబానా మహమ్మద్, పోరండ్ల రమేష్, గడప శ్రీనివాస్, మంద మహేష్, శిల్ప, స్వప్నశ్రీ, అందే శంకర్, తోట అంజయ్య, భారీ, మూల కృష్ణారెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, మాలోతు మహాలక్ష్మి, హైమద్, మహమ్మద్ చాంద్, గన్ను మహేందర్ రెడ్డి, హనీఫ్, జొన్నల రమేష్, ముక్క భాస్కర్, సత్తినేని శ్రీకాంత్, విక్టర్, శారద, కట్టెకోల ప్రభాకర్, జ్యోతి రెడ్డి, కాంపల్లి కీర్తి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.2 లక్షలతో కల్వర్టు, డ్రైనేజీ పనులు ప్రారంభం..

పట్టణ సుందరీకరణే లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



**మెట్‌పల్లి, (సింగిడి):** పట్టణ అభివృద్ధిలో భాగంగా మెట్ పల్లి మున్సిపల్ అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డు బాలకృష్ణ నగర్ కాలనీలో రూ.లక్ష వ్యయంతో చేపట్టనున్న నూతన కల్వర్టు నిర్మాణ పనులను, 17వ వార్డులో రూ.లక్షతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 13వ వార్డులో కల్వర్టు, 17వ వార్డులో డ్రైనేజీ పనులు కలిపి మొత్తం రూ.2 లక్షలతో ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో త్వరలోనే మున్సిపాలిటీలోని 26 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మెట్పల్లి పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుడికందుల అజయ్, పందిరి రమేష్, ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, దీప నాగేశ్వరరావు, ఏలె లక్ష్మి, తోట ప్రవీణ్, ప్రసాద్, రమేష్, జెట్టి లక్ష్మణ్, కొమ్ముల సంతోష్ రెడ్డి, వెంకటేష్, నాగరాజ్, కాంట్రాక్టర్లు మహేందర్, నాగేష్, బిజ్జారపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ డిగ్రీ విద్యార్థినులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు

టాస్క్ ఆధ్వర్యంలోని నియామకాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు

అభినందించిన కళాశాల యాజమాన్యం



**కరీంనగర్, (సింగిడి):** ప్రతిష్ఠాత్మక టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 2026 నియామకాల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికై కళాశాల ప్రతిష్ఠను మరోసారి నిలబెట్టారు. ఎంపిక వివరాలను ఈ-మెయిల్ ద్వారా ప్రకటించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన నియామక ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థినులు, జూన్ 19న హైదరాబాద్‌లో జరిగిన తుది ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి ఎంపికైన విద్యార్థినులను సన్మానించి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. విద్యార్థినుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల అంకితభావమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టాస్క్ ప్రాంతీయ సమన్వయకర్త గంగాప్రసాద్ మాట్లాడుతూ, ఉపాధి అవకాశాల కల్పనలో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉప ప్రిన్సిపాల్, శిక్షణ,నియామక విభాగం అధికారి, అధ్యాపకులు, ఎంపికైన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు...

మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి సేవలు అభినందనీయం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురామారావు



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరంనేని పరుశరామ్ రావు ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశు రామారావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మచ్చలేని నాయకుడిగా పేద ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న గొప్పమహానాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. 108 అంబులెన్స్ ను తన హయాంలోనే పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారని దానితోపాటు ఆరోగ్య శ్రీ పథకాన్ని అందించిన గొప్ప సంస్కర్త వైయస్ రాజశేఖర్ రెడ్డి అని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో నిర్మించిన ఘనత రాజశేఖర్ రెడ్డి కే దక్కుతుందని వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా అధ్యక్షురాలు తోట స్వప్న, గిరవేన శ్రీనివాస్ యాదవ్, దొగ్గల భాస్కర్, పింగిలి రాకేష్, పింగిలి రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొడిగ శ్రీకాంత్,వైస్ ప్రెసిడెంట్ రాచపల్లి సాగర్, బిజిగిరి శ్రీకాంత్, కోరపల్లి మరియు వెంకటేశ్వర్ల పల్లి గ్రామశాఖ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , పోల్సాని సాగర్ రావుగారు,కొండు బిక్షపతి, బండారి శ్రీధర్, పుల్లూరు రవి, మేకల కొమరయ్య,కనకం కుమార్, పుల్లూరు సంపత్, పుల్లూరి సమ్మయ్య, కుమార్, రామచంద్ర, సమ్మయ్య, మహేష్, జమ్మికుంట మండల అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమన్ని విజయవంతం చేయడం జరిగింది.

# ప్రజా సేవకుడు.. ప్రథమ పౌరుడు



పట్టణ అభివృద్ధే అంతిమ లక్ష్యం
ప్రజల ఫోన్ కాల్‌కు స్పందన.. ఫ్లైఓవర్ పై గుంతల పూడ్చివేత
శభాష్ చైర్మన్ అంటూ ప్రజల దీవెనలు




**జమ్మికుంట, (సింగిడి):** ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ చైర్మన్‌గా పార్టీలకు అతీతంగా ప్రజల మన్ననలు పొంది సాధారణ పౌరుడిగా ఉన్న ఓ వ్యక్తి తన అంతిమ లక్ష్యం నెరవేర్చుకునేందుకు పట్టణ ప్రథమ పౌరుడిగా మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొలుగు ప్రశాంత్ కుమార్ తనదైన శైలిలో ముందుకు దూసుకుపోతూ ప్రజల మన్ననలు పొందడమే కాకుండా శభాష్ చైర్మన్ అంటూ పట్టణ ప్రజలు దీవిస్తున్నారు. ప్రతినిత్యం పట్టణంలోని వివిధ వార్డు లో ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నేనున్నా నంటూ ముందుకు రావడమే కాకుండా సత్వర పరిష్కార మార్గాలను చూపుతూ నిరంతర సేవలు అందిస్తున్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నేటి వరకు ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించడమే కాకుండా వాటి పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తూ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా నిధుల మంజూరుకు వివిధ పార్టీల నాయకులను కలుస్తూ వినతి పత్రాలు అందజేస్తూ పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. మనిషి పుట్టినప్పటి నుండి వివిధ రకాల కష్టనష్టాలు వచ్చి చివరి మజిలీలో తన అంత్యక్రియలు సజావుగా జరగాలని భావించే ప్రతి ఒక్కరి కుటుంబంలో ఉన్న ఆశలను నెరవేర్చేందుకు జమ్మికుంట పట్టణంలో ఉన్న స్మశాన వాటిక అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించడమే కాకుండా వివిధ వర్గాలకు చెందిన ప్రజల నుండి దాతల నుండి విరాళాలు సేకరిస్తూ స్మశాన వాటిక అభివృద్ధికి నాంది పలికారు చైర్మన్ ప్రశాంత్ కుమార్. ప్రతినిత్యం వందలాది వాహనాలు ఫ్లైఓవర్ (బ్రిడ్జి) పై నుండి వెళ్తు ఉండగా అక్కడ ఉన్న గుంతలను ఎవరూ పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ విషయాన్ని ఓ వ్యక్తి ఫోన్ కాల్ ద్వారా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్‌కు తెలియజేయడంతో వెంటనే స్పందిం చిన చైర్మన్ గుంత వద్దకు చేరుకొని సహాయ చర్యలు చేపట్టి పట్టణ ప్రజల దీవెనలు పొందారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సర్ అప్డేషన్ ఫాములు నింపే ప్రక్రియలో భాగంగా వార్డులలో ప్రజలకు ఫామ్స్ ఎలా నింపాలో అవగాహన కల్పిస్తూ ప్రజా సమస్యల పట్ల పెద్దన్న పాత్ర పోషిస్తూ నిరంతరం శ్రమిస్తూ ప్రజా కష్టాల్లో పాలుపంచుకుంటున్నారు. జమ్మికుంట మున్సిపల్ ప్రథమ పౌరుడికి ఉండవలసిన లక్షణాలన్నీ ఉండడమే కాకుండా యువకుడిగా అన్ని వర్గాల ప్రజలతో తనదైన ముద్ర వేసుకొని అభివృద్ధి లక్ష్యంగా ప్రశాంత్ కుమార్ పనిచేస్తు న్నాడనడంలో అతిశయోక్తి లేదు.

# తెలంగాణ చౌక్‌లో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు



**కరీంనగర్, (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. వి. నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. నరేందర్ రెడ్డికి తలపాగా, ఖడ్గాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, రాజ్‌కుమార్, అఫ్రీన్, వరాల నరసింగం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, మహాలక్ష్మితో పాటు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏటీసీ సెంటర్ భూమిపూజకు ఏర్పాట్లు ముమ్మరం

గాంధీనగర్‌లో స్థలాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



**హుస్నాబాద్, (సింగిడి):** హుస్నాబాద్ మండలం తోటపల్లి రెవెన్యూ శివారులోని గాంధీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించనున్న ఏటీసీ (ATC) సెంటర్ భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. ఈనెల 10న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త, ప్రజాప్రతినిధి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో, కార్యక్రమ స్థలాన్ని యంత్రాలతో చదును చేసే పనులు వేగవంతంగా చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ సైట్ ఇంజనీర్, ఏటీసీ సెంటర్ ప్రిన్సిపల్, గాంధీనగర్ గ్రామ సర్పంచ్ పోలు సంపత్, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ బంక చందు తదితరులు పనులను పరిశీలించి, భూమిపూజ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మించనున్న ఏటీసీ సెంటర్ ద్వారా ఈ ప్రాంత యువతకు నాణ్యమైన సాంకేతిక, నైపుణ్య శిక్షణ అందే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా ఉపాధి అవకాశాలకు అనుగుణంగా వివిధ కోర్సులు అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంలో, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధిలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గాంధీనగర్ ప్రాంతంలో ఇలాంటి శిక్షణా కేంద్రం ఏర్పాటుతో స్థానిక అభివృద్ధికి కొత్త ఊపు లభించడంతో పాటు, విద్యా మరియు ఉపాధి రంగాల్లో యువతకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, స్థానిక నాయకులు, అధికారులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మొక్కలు నాటడంలో జమ్మికుంట మున్సిపాలిటీ ఆదర్శంగా నిలవాలి


మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్,కమిషనర్ మల్లికార్జున స్వామి



**జమ్మికుంట, (సింగిడి):** మొక్కలు నాటడంలో రాష్ట్రం లోనే జమ్మికుంట మున్సి పాలిటీ ఆదర్శంగా నిలవాలని స్వచ్ఛ జమ్మికుంటగా తీర్చిదిద్దడంలో పట్టణ ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ మల్లికార్జున స్వామి అన్నారు. వనమహోత్సవం సందర్భంగా జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. జమ్మికుంటలోని ప్రతి కౌన్సిలర్, ప్రతి కుటుంబం, ప్రతి మహిళ తమ ఇళ్ల పరిసరాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షిం చాలని పిలుపుని చ్చారు. తల్లి జన్మనిస్తే.. మొక్కలు పునర్జన్మ ఇస్తాయి" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, కాలుష్యాన్ని నియంత్రిం చేందుకు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గృహాల ఆవరణల్లో అధిక సంఖ్యలో మొక్కలు నాటడంతో పాటు, అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాచర్ల రాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## గోదాములను నగర శివారుకు తరలించాలి

భారీ వాహనాల రాకపోకలు,
కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన
డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని గౌదాంగడ్డ ప్రాంతంలో ఉన్న కేంద్ర గిడ్డంగుల (వేర్‌హౌస్) సముదాయాన్ని బుధవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు సందర్శించారు. గిడ్డంగుల అధికారులతో కలిసి పరిసరాలను పరిశీలించి, ధాన్యం నిల్వల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గిడ్డంగుల నిర్వాహకురాలు విజయతో సమావేశమై గోదాముల తరలింపు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భారీ వాహనాల రాకపోకల వల్ల జరుగుతున్న ప్రమాదాలు, కాలుష్యం వంటి అంశాలపై చర్చించారు. గోదాముల తరలింపు అంశాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆమెకు సూచించారు. యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, 1966లో ఈ గోదాములు ఏర్పాటు చేసినప్పుడు అది పట్టణ శివారు ప్రాంతమని, ప్రస్తుతం నగర విస్తరణతో చుట్టుపక్కల నివాస కాలనీలు ఏర్పడ్డాయని తెలిపారు. గిడ్డంగులకు నిత్యం వచ్చే భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, కాలుష్యంతో స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా స్థానిక ప్రజలు గోదాములను నగరానికి దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై గతంలోనే కేంద్ర గిడ్డంగుల సంస్థ (సీడబ్ల్యూసీ) చైర్మన్‌కు వినతిపత్రాలు సమర్పించినట్లు గుర్తు చేశారు. గతంలో 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండగా ప్రస్తుతం సుమారు 23 వేల మెట్రిక్ టన్నులకు తగ్గినప్పటికీ, భారీ వాహనాల రాకపోకలు మాత్రం తగ్గలేదన్నారు. ప్రస్తుతం నగరానికి రైల్వే సౌకర్యం అందుబాటులో ఉన్నందున, గిడ్డంగులను రైల్వేమార్గానికి అనువైన నగరశివారు ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ సమస్యను త్వరలోనే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వస్థాయిలో గోదాముల తరలింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, (సింగిడి):** హనుమకొం డలోని రెడ్‌క్రాస్ భవనం వెను కాల ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, గోడౌన్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గోడౌన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జగత్ సింగ్, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ జయంతి

వైయస్సార్ ఆశయాలను కొనసాగిద్దాం

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్



**జమ్మికుంట, (సింగిడి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి వేడుకలు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నో సేవలను అందించి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కే దక్కుతుందని తెలిపారు. 108 అంబులెన్స్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అందించి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ వైఎస్ఆర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు సాయిని రవి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్స్ చంద రాజు ఒగ్గు రమేష్ ఎగిత అశోక్ దిడ్డి రామ్మోహన్ పొనగంటి విష్ణు కుతాడి తిరుపతి యాట్ల సునీత అశోక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మానుపాటి సూర్య జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లింగంపల్లి లింగారావు దొడ్డే శ్రీకాంత్ ఫిషర్ మేన్ పింగళి రాకెష్ ఎక్స్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యం డి సలీం పొన్నగంటి మధు పాత ప్రసాద్ ఎగ్గని శ్రీనివాస్ పిట్టల రమేష్ మిడిదొడ్డి శంకర్ గుర్రపు ప్రవీణ్ నాగేంద్ర వినయ్ కుమార్ రాజు కుమార్ ముఖ్య నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

### హరిత హుజురాబాద్ లక్ష్యంగా మొక్కల నాటడం



**హుజురాబాద్,(సింగిడి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజురాబాద్ పట్టణంలోని కే. సి. క్యాంపు వద్ద మహాత్మా గాంధీ విగ్రహం పక్కనున్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పురపాలక సంఘ చైర్‌పర్సన్ సుహాసిని రొంటాల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పచ్చ దనం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మాధవి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, కార్యాలయ మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధుల విడుదలతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్



**కరీంనగర్,(సింగిడి):** రైతు భరోసా పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయడంతో కరీంనగర్ నియోజకవర్గం కొత్తపల్లి మండలం బావాపేట గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, రైతులను శాలువాలతో సన్మానించి స్వీట్లు పంచారు.
ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. రైతు భరోసా, రైతు భీమా, సబ్సిడీలు, బోనస్ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ. 12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్న ప్రభుత్వం, ఇటీవల ఒక ఎకరం నుంచి ఎనిమిది ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి రైతాంగం ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామి గౌడ్, మడుపు మోహన్, బోనాల మురళి, అమ్మిడిశెట్టి కనకయ్య, దుర్గం, అంజయ్య, గుగుర్తి మురళి, ప్రభాకర్, చంద్రయ్య, రావునేని సంపత్, గుండ మల్లేశం, సుంకె రాజు, బండపల్లి చందు, పెంట శేఖర్, అరె మల్లేశం తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభాతవన సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
14-7-2026

కల్వల ప్రాజెక్ట్, తనుగుల చెక్ డ్యాంలను

## పునరుద్ధరించండి: వొడితల ప్రణవ్..



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసిన ప్రణవ్..
త్వరలో పనులు చేపడతామని హామీ..

**జమ్మికుంట, (సింగిడి):** వీణవంక, జమ్మికుంట మండలాల్లోని రైతుల సాగు నీరు అందించే కల్వల ప్రాజెక్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సచివాలయంలోని వారి ఛాంబర్‌లో కలిసి విన్నవించారు. హుజురాబాద్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..ఈ మేరకు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే గుంపుల-శంభునిపల్లి గ్రామాల పరిధిలోని తనుగుల చెక్ డ్యాంను కూడా త్వరితగతిన పునరుద్ధరణ చేయాలని కోరారు.రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో పనులు మొదలు పెడతామని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## రైతులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు, సంయుక్త తనిఖీలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**కరీంనగర్, (సింగిడి):** యాసంగి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు.బుధవారం చిగురుమామిడి మండలం పీచుపల్లి, లంబాడిపల్లి (గ్రామాలు), కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన కలెక్టర్, అకాల వర్షాల వల్ల నష్టం జరగకుండా టార్పాలిన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, లోపాలు ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోళ్లు



నిర్వహించాలని, వడదెబ్బ నివారణకు వైద్య కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. గత సంవత్సరం కొనుగోళ్ల గణాంకాలను పరిశీలించి, అదే విధంగా ప్రస్తుత కొనుగోళ్లకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు.సంయుక్త పర్యవేక్షకు ఆదేశాలు,మండలాల వారీగా ప్రత్యేక అధికారులు, రెవెన్యూ మరియు పౌర సరఫరాల శాఖలు కలిసి కొనుగోళ్లను పర్యవేక్షించాలని తెలిపారు. కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తూ రికార్డులు పరిశీలించాలని, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమన్వయంతో త్వరగా మిల్లింగ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, రికార్డులు పరిశీలించిన కలెక్టర్ సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారి అంటే ఇలా ఉండాలి..

ఏసీ గదులు వదిలి.. ట్రాక్టర్ ఎక్కి..
కార్మికులను అభినందించిన హుస్నాబాద్ కమిషనర్



**హుస్నాబాద్, (సింగిడి):** చాలామంది అధికారులు కేవలం ఏసీ గదులకే పరిమితమై ఫోన్ల ద్వారా ఆదేశాలు ఇవ్వడానికే మొగ్గు చూపుతున్న తరుణంలో, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గౌడ్ మాత్రం అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలోకి దూకారు. బుధవారం ఉదయం ఆయన పట్టణంలోని పలు కాలనీల్లో స్వయంగా పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ క్రమంలో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల పనితీరును అభినందించడమే కాకుండా, స్వయంగా చెత్త ట్రాక్టర్ ఎక్కి తనిఖీలు చేపట్టడం విశేషం. ట్రాక్టర్ ఎక్కి మరీ చెత్త సేకరణ తీరును, తడి-పొడి చెత్త విభజన ప్రక్రియను నిశితంగా పరిశీలించిన కమిషనర్, కార్మికులకు పలు కీలక సూచనలు చేశారు. పారిశుధ్య కార్మికులు పడుతున్న శ్రమను గుర్తించి, వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ఉత్సాహాన్ని నింపారు. ఒక ఉన్నతాధికారి హోదాలో ఉండి కూడా ఎటువంటి సంకోచించకుండా సామాన్యుడిలా వీధుల్లో పర్యటిస్తూ, కార్మికుల పనిని గౌరవించిన తీరు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కమిషనర్ మల్లికార్జున గౌడ్ చూపిన ఈ చొరవపై అటు మున్సిపల్ సిబ్బంది, ఇటు పట్టణ ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# జమ్మికుంటతో నాకు విడదీయరాని బంధం...

రామగుండం కార్పొరేషన్ చైర్మన్ మహంకాళి స్వామి
'మహంకాళి'ని ఘనంగా సన్మానించిన స్థానిక కాంగ్రెస్ నేతలు



**జమ్మికుంట,(సింగిడి):** జమ్మికుంట ప్రాంతంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని ఇక్కడకు వస్తే తన సొంత ఇంటికి వచ్చిన ఆనందం కలుగుతుందని రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి అన్నారు.బుధవారం స్వామి జమ్మికుంట పట్టణానికి వచ్చిన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి తన నివాసానికి ఆహ్వానించి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఎన్ ఎస్ యు ఐ లో క్రియాశీలకంగా పనిచేశానని చిన్నప్పటినుండి ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఈ ప్రాంత నాయకులంతా కూడా తన మిత్రులే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు వస్తుందని రాబోయే రోజుల్లో స్థానిక నేతలకు నామినేటెడ్ పదవులు దక్కుతాయని తెలిపారు. కష్టపడ్డ ప్రతీ నాయకునికి న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు సూచన మేరకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని పార్టీ కార్యక్రమాలలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత కాంగ్రెస్ పార్టీ నాయకులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మీకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ జిల్లా నాయకులు సాయిని రవి శ్రీ దుబ్బ మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ ముద్దు మల్ల రవి మాజీ కౌన్సిలర్ బొంగోని వీరన్న గౌడ్ రామ్‌రెడ్డి అజయ్ రామ్మూర్తి తో పాటు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాచర్ల రాజు ఏగీత అశోక్ యాట్ల సునీత అశోక్ కాంగ్రెస్ నాయకులు పొన్నగంటి మధు చిన్నింటి నాగేంద్ర ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుకు

## బీఆర్ఎస్ సంబరాలు

కరీంనగర్‌లో టపాసులు, స్వీట్లు పంచిన నాయకులు



**కరీంనగర్, (సింగిడి):**
కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ, కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. నగరంలోని తెలంగాణ చౌక్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాజీ ఏంఎల్సి నారదాస్ లక్ష్మన్ రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ రావు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. పీసీ ఘోష్ నివేదికలో ఉన్న లోపాలను గుర్తించిన కోర్టు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ఎలాంటి చర్యలు అవసరం లేదని స్పష్టం చేసినట్లు తెలిపారు.కోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చే అవకాశాన్ని ముందే గ్రహించిన ప్రభుత్వం, గత రెండున్నరేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై మరమ్మతుల పేరిట హడావుడి సృష్టించిందని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమం లో నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్ కుమార్ షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య:
సిఐ రామకృష్ణ గౌడ్



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా సిఐ రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.ఆయనమాట్లాడుతూవిద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు.ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో జరిగిన స్టడీ మెటీరియల్ ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వ పాఠశాలలో కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని విశేషంగా ఆకట్టు కున్నాయి. వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు షీల్డ్‌లో బహుమతులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి హేమలత, సర్పంచ్ కందికట్ల మధుసూదన్, ఉపసర్పంచ్ రాజు యాదవ్, వార్డ్ మెంబర్లు పల్లె నిఖిల గౌడ్, గిరి వేణ సౌజన్య, ప్రధానోపాధ్యాయులు రవీందర్ బలరాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి:
సుడా చైర్మన్ కోమిటి రెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్,(సింగిడి):** కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు, ఏలబోతారం, చామన్ పల్లి, బహదూర్‌ఖాన్‌పేట్, దుబ్బపల్లి, చర్లభూత్కూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. గత వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వస్తుండటంతో, కేంద్రాలు ప్రారంభమైన వెంటనే తూకం ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, మిల్లులకు తరలించే వరకు సజావుగా నిర్వహించాలని అధికారు లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ అధికారులు రామ్మోహన్, సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాహక అధికారి రమేష్, ఇతర సిబ్బంది రాజేశం, కృష్ణ, అశోక్‌తో పాటు సంబంధిత గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ చైర్మన్..

రైతుకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం...
మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం..



**జమ్మికుంట, (సింగిడి):**
జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, సహకార సంఘం ఇన్చార్జ్ అరుణ్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట మండల కేంద్రంలోని రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రైతులు పండించిన పంటను మద్దతు ధర 23 89 రూపాయల చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని గ్రామీణ ప్రాంతాలలోని రైతులు దళారుల మాటలు నమ్మి మోస పోకుండా నేరుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. వేసవి కాలంలో ఎండ ఎక్కువగా ఉండడంతో రైతులకు ఏ విధంగా ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అన్ని రకాలైన ఏర్పాట్లను చేయడంతో పాటు గన్ని సంచులతో పాటు టార్పాలీనలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. మిల్లర్లకు సైతం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని రైతుల దగ్గర కొనుగోలు చేసిన వారి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల ద్వారా తరలించాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం సీఈవో రవీందర్ , మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వరరావు తో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ప్రారంభమైన ఆధునిక పురుషుల సెలూన్

**కరీంనగర్,(సింగిడి):** నగరం లోని గోదాం గడ్డ, అయ్యప్ప టెంపుల్ రోడ్డులో నూతనంగా సర్వసన్నద్ధంగా తయారైన "న్యూ ట్రెండింగ్ కటింగ్ షాప్, మెన్ సెలూన్" బుధవారం ఘనంగా పునఃప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి సెలూన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా యజమానులు ఎలగందుల పవన్ కళ్యాణ్, ఎలగందుల రమేష్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పొన్నం మొండయ్య-లక్ష్మి, కాలనీ నివాసితులు, సెలూన్ సిబ్బంది పాల్గొన్నారు. నగరవాసుల కోసం ఈ సెలూన్‌లో అత్యాధునిక హెయిర్ స్టైలింగ్, గ్రూమింగ్ సేవలు అందుబా టులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు .

నగరవాసులకు అత్యాధునిక హెయిర్ స్టైలింగ్ సేవలు అందుబాటులోకి..



# డిమాండ్లు తీరేదాకా తగ్గేదేలే..



**హుస్నాబాద్ (సింగిడి):**హుస్నాబాద్ డిపో వేదికగా ఆర్టీసీ కార్మికులు బుధవారం ఉదయం నుంచే సమ్మె సైరన్ మోగించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుండే కార్మికులు ఐక్యంగా డిపో ఎదుట బైఠాయించడంతో బస్సులు చక్రం తిప్పలేదు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని, వెనక్కి తగ్గేది లేదని కార్మిక నాయకులు తెగేసి చెప్పారు. డిపో నుండి ఒక్క బస్సు కూడా బయటకు రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఈ నిరసనలో మహిళా కండక్టర్లు కూడా పెద్ద ఎత్తున పాల్గొని తమదైన రీతిలో నిరసన తెలిపారు. తమ గోడును ప్రభుత్వానికి వినిపించేలా డిపో ఎదుట మహిళా కార్మికులు బతుకమ్మలు ఆడి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. సమ్మెను భగ్నం చేసేందుకు అధికారులు ప్రైవేట్ డ్రైవర్లను రంగంలోకి దించే ప్రయత్నం చేయగా, కార్మికులు వారిని వినూత్నంగా అడ్డుకున్నారు. తమ పొట్ట కొట్టవద్దని, విధులకు హాజరుకావద్దని ప్రైవేట్ డ్రైవర్లకు చేతులు జోడించి దండం పెడుతూ కార్మికులు వేడుకోవడం అక్కడ ఉన్న వారిని కదిలించింది. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే హుస్నాబాద్ బస్టాండ్ ఒక్కసారిగా వెలవెలబోయింది. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి



తెల్లవారుజాము నుండే రోడ్డెక్కిన ఆర్టీసీ కార్మికులు!
డిమాండ్లు తీర్చే వరకు సమ్మె విరమించం
బతుకమ్మ ఆడి నిరసన తెలిపిన మహిళా కండక్టర్లు



బస్సుల కోసం వేచి చూసి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు అడ్డగోలుగా చార్జీలు వసూలు చేస్తున్నారంటూ ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించి, సామాన్యులకు రవాణా ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు. తమ పోరాటం న్యాయబద్ధమైం దని, ప్రభుత్వం దిగివచ్చే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.


## సుడా పనులపై సమీక్షా సమావేశం

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.



**కరీంనగర్, (సింగిడి):**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని, కొత్త పనులకు టెండర్ల ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.సుడా వాణిజ్య భవనం తొలి దశ పనులు చివరి దశకు చేరుకున్నాయని, అవి పూర్తయ్యాక మిగిలిన పనులకు టెండర్లు పిలవాలని సూచించారు. రాజీవ్ చౌక్‌లో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం, చౌక్ సుందరీకరణ, ఐడీఎస్ఎంటి పనులు, వర్టికల్ గార్డెన్లను మే 21లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదే రోజు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ పనులను ముఖ్య అతిథుల చేత ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ శివానంద్, డీఈఈలు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఏఈఈలు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ జర్నలిస్ట్, దళిత రత్న అవార్డు గ్రహీత ఆరె శరత్‌కు ఘన సన్మానం



**హుస్నాబాద్ (సింగిడి):**
హుస్నాబాద్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయుడు, ఉత్తమ జర్నలిస్ట్ మరియు దళితరత్న అవార్డు గ్రహీత ఆరె శరత్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉత్తమ జర్నలిస్ట్, దళిత రత్న అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ పట్టణంలో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వికాస్ కళాశాల అధినేత మహ్మద్ సాజిద్, అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వేముల గణేష్‌లు ఆరె శరత్‌ను శాలు వాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జర్నలిజం రంగంలో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని వారు కొనియా డారు. వారు మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకు వచ్చి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత జర్నలి స్టులదని, ఆ బాధ్యతను శరత్ సమర్థ వంతంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై ధైర్యంగా రాసి మంచి గుర్తింపు పొందారని అభినందించారు. ఈ సన్మానం పట్ల ఆరె శరత్ ఆనందం వ్యక్తం చేస్తూ, తనపై చూపుతున్న ప్రేమాభిమానాలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా మ్యాకమల్ల అశోక్

ఘనంగా సన్మానించిన నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు

**జమ్మికుంట, (సింగిడి):** ఇటీవల ప్రకటించిన జిల్లా కాంగ్రెస్ నియామక జాబి తాలో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామా నికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మ్యాకమల్ల అశోక్ జిల్లా కార్యదర్శిగా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కార్యదర్శిగా నియమించబడిన అశోక్ ని బుధవారం హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాయితీతో పని చేసుకుంటూ వెళ్తున్న కార్యకర్తలకు గుర్తింపు తప్పనిసరిగా ఉంటుం దని దీనికి నిదర్శనం అశోక్ ని జిల్లా కార్యవర్గం లోకి తీసుకోవడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, సుంకరి రమేష్, సదయ్య, ఎగేటి కుమారస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరుశురాం రావు,గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివారెడ్డి, సాయిని రవి, మేకమల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన పోరాటానికి మద్దతు..

ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలి..
జేరిపోతుల జనార్ధన్,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సిద్దిపేట



**హుస్నాబాద్ (సింగిడి)::**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ పేర్కొన్నారు...బుధవారం రోజున హుస్నాబాద్ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన హాజరయ్యారు..ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ... ఆర్టీసీని కాపాడుకోవడం అంటే ప్రజా రవాణాను కాపాడుకోవడమే అని కార్మికులు అడుగుతున్న డిమాండ్లు అన్నీ చట్టబద్ధమైనవి న్యాయమైన వని వారి మనుగడకు సంబంధించినవి అన్నారు.. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా, కార్మికులను చర్చలకు పిలవకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని.. కష్టకాలంలో ప్రజలను గమ్యస్థానాలకు చేర్చే కార్మికుల పట్ల ఈ వివక్ష తగదన్నారు...సిద్దిపేట జిల్లాలో ఉన్న కార్మిక సోదరులందరికీ సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని. కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు..ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరపాలని అన్నారు.. పెండింగ్‌లో ఉన్న జీతాలను, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు..వారు ప్రభుత్వం ముందు పెట్టిన 32 అంశాల డిమాండ్ లలో 32 అంశాలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు..ఆర్టీసీ సంస్థను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకుని, ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు..ఆర్టీసీ కార్మికుల పోరాటం కేవలం వారి జీతాల కోసం మాత్రమే కాదు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ రవాణా వ్యవస్థను కాపాడుకోవడం కోసమేనని ఈ పోరాటంలో విజయం సాధించే వరకు మా మద్దతు కొనసాగుతుందని జనార్ధన్ స్పష్టం చేశారు.. హుస్నాబాద్ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ప్రభుత్వంతో చర్చలలో ముందు వరుసలో ఉండి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషించాలని ఆయన అన్నారు.

# డంపింగ్ యార్డ్‌పై బీజేపీ నిరసన సెగ





**జమ్మికుంట,(సింగిడి):**హుజరాబాద్ ప్రభుత్వం మండలంలోని సిరిసపల్లి శివారులో మొండిగా ఏర్పాటు చేయ తలపెట్టిన డంపింగ్ యార్డుపై నిరసన జ్వాలలు మిన్నంటాయి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ, పర్యావర ణానికి విఘాతం కలిగించే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తాను స్తంభింపజేశాయి. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వేదికగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో, ఆందోళన నిర్వహించారు.

**అట్టుడికిన అంబేద్కర్ చౌరస్తా ..**
సిరిసపల్లి శివారులో 'వేస్ట్ టు ఎనర్జీ' పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలంటూ కమలదళం రోడ్డుపై బైఠాయించింది. "డంపింగ్ యార్డ్ హటావో.. హుజరాబాద్ బచావో" అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు.కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో చౌరస్తా ప్రాంతం ఉద్రిక్తంగా మారిపోయింది. వరంగల్ – కరీంనగర్ ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**పోలీసులు, నాయకుల మధ్య తోపులాట..**
శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సహా పలువురు కార్యకర్తలను పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ వాహనాల్లోకి ఎక్కించారు. ఈక్రమంలో పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట?. నేతలను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. అరెస్టు చేసిన వారందరినీ స్థానిక పోలీస్ స్టేషన్ తరలించారు.

ప్రజల జీవితాలతో చెలగాటం ఆడితే సహించం
24 గంటల్లో ప్రభుత్వం స్పందించాలి:
బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**24 గంటల అల్టిమేటం..**
**-గంగాడి కృష్ణారెడ్డి హెచ్చరిక...**

గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా జనవాసాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ఊరుకోం. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని 24 గంటల్లోగా వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కాంగ్రెస్ పార్టీకి పతనం తప్పదు. రాబోయే రోజుల్లో 'కాంగ్రెస్ సర్కార్ హటావో' నినాదంతో ముందుకు వెళ్తాం" అని హెచ్చరించారు.

singidinews@gmail.com



# మళ్లీ బిజీగా మారిన నటి లయ

## వదలను సినిమా 17న విడుదల

అందాల నటి లయ 'భద్రం కొడుకో' చిత్రంతో బాలనటిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత 'స్వయంవరం'తో హీరోయిన్ గా ఎదిగింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో పలు అర్ధవంతమైన చిత్రాలలో నటించిన లయ... ఉత్తమ నటీగా నంది అవార్డులు అందుకుంది. అయితే ఆ తర్వాత వివాహానంతరం అమెరికాకు వెళ్ళిపోవడంతో కొన్నేళ్ళు నటనకు దూరంగా ఉంది. ఆ మధ్య రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోని' మూవీలో తన కూతురుతో కలిసి మెరుపులా మెరిసన లయ... గత యేడాది 'తమ్ముడు' సినిమాతో రీ–ఎంట్రీ ఇచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా లయ అక్కగా నటించింది. కానీ ఆ సినిమా నిరాశ పర్చింది. ఆ తర్వాత తనకు బాగా కలిసి వచ్చిన శివాజీ సరసన లయ 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రంలో నాయికగా నటించింది. కానీ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గతంలో జగపతిబాబు సరసన 'మనోహరం'లో నటించి మంచి పేరు తెచ్చుకున్న లయ ఇప్పుడు మరోసారి ఆయనతోనే 'వదలా' చిత్రంలో చేస్తోంది. హృతికా శ్రీనివాస్ కీలక పాత్ర పోషించిన 'వదలా' హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాను ఆకెళ్ళ వి కృష్ణ తెరకెక్కించాడు. మూడు వారాల క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమాకు మరింత మెరుగులద్ది జూలై 17న విడుదల చేస్తున్నట్టు జగపతి బాబు తెలిపారు. విశేషం ఏమంటే... గతంలో శ్రీకాంత్ సరసన పలు చిత్రాలలో నటించిన లయ ఇప్పుడు 'మిస్టర్ మిడిల్ క్లాస్'మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇందులో రాజేంద్ర ప్రసాద్ వేంకటేశ్వర స్వామిగా నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ మూవీని జి. నాగేశ్వరరెడ్డి డైరెక్ట్ చేశారు. ఈ సినిమా కూడా జూలై 17నే రాబోతోంది. ఇలా సెకండ్ ఇన్నింగ్స్‌లో లయ హీరోయిన్ గా నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం కాకతాళీయం. ఇదే విషయాన్ని 'వదలా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమ్మారెడ్డి భరద్వాజ దగ్గర ప్రస్తావించినప్పుడు ఆయన చాలా స్పోర్టివ్‌గా ఈ అంశాన్ని తీసుకున్నారు. 'ప్రతి వారం ఐదారు సినిమాలు వస్తూనే ఉంటాయి. అందులో బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. లయ నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం తప్పేమీ కాదు. నిర్మాతలం ఎవరి వీలును బట్టి వాళ్ళం సినిమాలు రిలీజ్ చేస్తుంటాం. ఏ సినిమా బాగుంటే అది ఆడుతుంది... అంతే!' అని అన్నారు. ఈ వీకెండ్‌లో ఎనిమిది చిత్రాలు విడుదల అవుతుండగా, అందులో లయవి రెండు సినిమాలు. మరి వీటిల్లో ఏయే సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్ విడుదల




మలయాళ స్టార్ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో తొలిసారిగా పూర్తి స్థాయి తెలుగు పాత్రలో నటిస్తున్న చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఫహాద్ ఈసారి మరో ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతుండగా, 'బాహుబలి' నిర్మాత శోభు యార్లగడ్డతో పాటు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సోమ వారం చిత్రబృందం అధికారికంగా టీజర్‌ను విడుదల చేసింది. విడుదలైన కొద్దిసేపటికే టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. టీజర్‌ను పరిశీలిస్తే.. ఫహాద్ ఫాజిల్ ఒక మెజీషియన్ పాత్రలో కనిపిస్తున్నారు. చిన్నారి ముందు వరుసగా మ్యాజిక్ ట్రిక్స్ చేస్తూ ఆమెను అలరిస్తుంటాడు. అయితే ఆ ఆటలో భాగంగా చిన్నారిని మాయంచేసే ప్రయత్నం చేస్తాడు. కానీ ఆ తర్వాత ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటాయి. సాధారణంగా కనిపించిన ఆ చిన్నారి ఒక్కసారిగా వింతగా ప్రవర్తించడం మొదలు పెడుతుంది. ఆత్మ ఆవహించినట్లు విచిత్రమైన శక్తులను ప్రదర్శిస్తూ మెజీషియన్‌కే షాక్ ఇస్తుంది. పరిస్థితి చేతికి అందకుండా పోవడంతో భయపడిన ఫహాద్ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తాడు. అయితే ఆ చిన్నారి అతడిని వెంటాడుతూ కనిపించడం టీజర్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. హారర్, ఫాంటసీ, థ్రిల్లర్ అంశాలను కలగలిపి రూపొందించిన ఈ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా చివర్లో వచ్చే విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్‌తో పాటు సారా పాలేకర్, సౌరభ్ సచ్‌దేవ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వినూత్న కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నటీనటుల పాత్రలు కూడా ప్రత్యేకంగా ఉండనున్నట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

### మహేశ్‌బాబు కుటుంబంలో

# పెళ్లి సందడి



సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. కొరియాకు చెందిన యువతి హాయిన్ (జిన్నీ)తో ప్రేమలో ఉన్న సిద్దార్థ్, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ శుభకార్యానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు హాజరై సందడి చేశారు. మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను షేర్ చేస్తూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోల్లో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, కుటుంబ సభ్యులు కనిపించారు. ముఖ్యంగా మహేష్ అన్న దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా అరుదుగా పబ్లిక్‌లో కనిపించే భారతి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభిమానులు ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సిద్దార్థ్ గల్లా ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు గల్లా జయదేవ్ మరియు పద్మావతి దంపతుల చిన్న కుమారుడు. ఆయన అన్న అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా టాలీవుడ్‌లో అడుగు పెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం అశోక్ గల్లా నటిస్తున్న 'వీసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక సిద్దార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా ఉండి కుటుంబ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తున్నారు.
కొంతకాలంగా కొరియన్ యువతి హాయిన్‌తో ప్రేమలో ఉన్న ఆయన, ఇప్పుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు.



### 24న సందడి చేయనున్న

# 'జన నాయగన్'

### ఓవర్‌సీస్‌లో అన్‌కట్ వర్షన్ విడుదల



ఏడు నెలల నిరీక్షణకు చెక్ పెడుతూ.. 'జన నాయగన్' జులై 24న సందడి చేయనుంది. విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. బోర్డు చెప్పిన మార్పులను చేసి చిత్రబృందం దీన్ని విడుదల చేసేందుకు సిద్ధమైంది. అయితే ఓవర్సీస్‌లో మాత్రం ఈ సినిమా అన్‌కట్ వెర్షన్ విడుదల కానుంది. భారత్‌లో పలు కట్స్ విధించినప్పటికీ, యూకే లో మాత్రం ఈ చిత్రం ఎలాంటి కట్స్ లేకుండా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడ ఈ సినిమాను ఎలాంటి మార్పుల్లేకుండానే విడుదల చేసేందుకు అనుమతి లభించింది. ఇక విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో సినిమా టైటిల్ కార్డులోనూ మార్పు చేశారు. గతంలో దళపతి విజయ్ అనే టైటిల్ కార్డు.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌గా మారనుంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించడంతో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని.. మరికొన్ని సన్నివేశాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో త్వరలోనే దీని రిలీజ్ ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

Cinma సినిమా సింగిడి

మంగళవారం
14-7-2026




# ఇండియా స్టోరీపై నీలినీడలు

కాజల్, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలు పోషించిన హిందీ సినిమా 'ది ఇండియా స్టోరీ'. ఈ నెల 24న ఈ సినిమా హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల కాబోతోంది. చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సాగర్ బి షిండే కథను అందించి, నిర్మిస్తున్నారు. ఈ కోర్ట్ రూమ్ డ్రామా ప్రజలు తీసుకునే ఆహారాన్ని విషతుల్యం చేస్తున్న ఎరువుల నేపథ్యంతో రూపుదిద్దుకుంది. విషపూరిత పురుగు మందుల వ్యవసాయం, దాని వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం వంటి అంశాల ఆధారంగా దీనిని తెరకెక్కించారు. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనేది ఈ మూవీ ట్యాగ్ లైన్. ఇదిలా ఉంటే... తాజాగా విడుదలైన టీజర్ లో భారత వ్యవసాయం, పురుగు మందుల వినియోగం, ఆహార భద్రతపై ఇచ్చిన గణాంకాలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో ఆగ్రో కెమికల్ రంగానికి చెందిన ఓ ప్రముఖ సంస్థ సీబీఎఫ్‌సి (సెంట్రల్ బోర్డ్ ఫాఫ్ ఫిల్మ్ సర్టిఫికెషన్)ను ఆశ్రయించింది.
ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చే ముందు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరింది. ఈ మూవీ తాజా టీజర్‌లో శాస్త్రీయ ఆధారాలను చూపకుండా ప్రజలలో భయాందోళనలకు కలిగించేలా ఉందని ఫిర్యాదు దారులు పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారం వల్ల రైతులు, వ్యవసాయ రంగం, వ్యవసాయ ఉత్తత్తులపై ప్రభావం పడే ఆస్కారం ఉందని వారు సి.బి.ఎఫ్.సి.కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలుస్తోంది. అలానే ఈ సినిమాలో పేర్కొన్న అంశాలకు తగిన ఆధారాలు చూపించవలసిందని కోరుతూ నిర్మాతలకు ఇప్పటికే కోర్ట్ నోటీసులు ఇచ్చిందనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 24న విడుదల కావాల్సిన 'ది ఇండియా స్టోరీ'పై నీలినీడలు కమ్ముకున్నాయనిపిస్తోంది.
ఈ చిత్రానికి నిశాంత్ భగవత్ సినిమాటోగ్రఫీ అందించగా, మంగేష్ ధాక్డే సంగీతం సమకూరుస్తున్నారు. ఆశిష్ మత్రే ఎడిటింగ్, షకీల్ అజ్మీ సాహిత్యం, అన్మోల్ భావే సౌండ్ డిజైనర్.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737